# అఖండ భూమి

AKANDA BHOOMI TELUGU DAILY

ఎడిటర్ : యం. ఈశ్వరయ్య సంచలన దినపత్రిక

పచురణ: కర్నూలు,ఆంధ్రప్రదేశ్ సంపుటి : 04 సంచిక : 145 ఎడిటర్ : ఎం ఈశ్వరయ్య పేజిలు : 08, శుక్రవారం 24-07-2026 సెల్ : 9440912389, 9490315559 వెల రూ. 2 రూ/

Published From kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor, Kurnool,




వైసీపీ నేత సీదిరి అప్పలరాజుకు 14 రోజుల రిమాండ్



నీట్‌పై ప్రధాని వీడియో దయనీయం.. మంత్రి రాజీనామా చేయాలి: రాహుల్ గాంధీ

## ప్రపంచ అనిశ్చితుల మధ్యా భారత్ బలంగా ముందుకు సాగుతోంది

- వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటన్న ఆర్‌బీఐ
- జూన్ వరకు ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగినట్లు వెల్లడి
- పారిశ్రామిక, సేవారంగాల పనితీరు స్థిరంగా ఉందని భరోసా
- ఎగుమతులు, దిగుమతుల్లో వృద్ధి కొనసాగిందని వెల్లడి
- ఎఫ్‌డీఐ, ఎఫ్‌పీఐ పెట్టుబడులు పెరిగినట్లు తెలిపిన ఆర్‌బీఐ




ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ.. భారత్ ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా కొనసాగుతోందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పేర్కొంది. జూన్ వరకు దేశ ఆర్థిక కార్యకలాపాల్లో వృద్ధి కొనసాగిందని, పారిశ్రామిక, సేవారంగాల - మిగతా 2 లో

## పీఓకే ప్రధాని కావాలనుకుంటున్నా

నవాజ్ షరీఫ్ సంచలన ప్రకటన



- ప్రజల నిరసనలతో అట్టుడుకుతున్న పీవోకే ప్రాంతం
- పీవోకే పీఎం కాకపోయినా ఈ ప్రాంత అభివృద్ధిని స్వయంగా పర్యవేక్షిస్తానన్న నవాజ్ షరీఫ్
- ఎన్నికల వేళ డ్రామాలు ఆడుతున్నారంటున్న విశ్లేషకులు

పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. సాధారణంగా దేశ ప్రధాని పదవిని చేపట్టిన నాయకులు ప్రాంతీయ పదవుల వైపు చూడరు. కానీ నవాజ్ షరీఫ్ మాత్రం ఏకంగా పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) కు - మిగతా 2 లో

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు



- 48 గంటల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్
- గ్లోబరీనా టెక్నాలజీస్‌పై చేసిన ఆరోపణలపై వివాదం
- 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- లేదంటే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లీగల్ నోటీసు పంపారు. - మిగతా 2 లో

## ఎల్‌నినో ఎఫెక్ట్ ప్రతి వర్షపు చుక్కనూ కాపాడుకుందాం



- ఎల్‌నినో కారణంగా తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్న పొన్నం
- అధికారులకు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- ఆరుతడి పంటలు వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచన

ఎల్‌నినో ప్రభావం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని - మిగతా 2 లో

# ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదు?

- ఫిర్యాదు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్
- తప్పుడు ఫిర్యాదు అయితే లోపల వేయిస్తానని హెచ్చరిక
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ డిమాండ్ చేయడం లేదని విమర్శ




తనకు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయంటూ వస్తున్న ఆరోపణలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన, తనపై వస్తున్న ఆరోపణలపై

# ప్రధాని మోదీ హామీ గంటల్లోనే కార్యాచరణ

పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం

- ఫాస్ట్-ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు
- కొత్త యాంటీ-చీటింగ్ చట్టం కింద పేపర్ లీకేజీ కేసుల విచారణ
- దోషులుగా తేలితే 5 ఏళ్ల జైలు, రూ.10 లక్షల వరకు జరిమానా
- తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టుల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం
- యువత భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టేది లేదన్న మోదీ






దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా, వేగంగా

## ఢిల్లీ పోలీసులకు ఎన్ఎస్ఏ అధికారాలు

సీజేపీ ఆందోళనల వేళ సర్వత్రా ఉత్కంఠ



- ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు ఎన్ఎస్ఏ కింద నిర్బంధ అధికారాల పునరుద్ధరణ
- ఇది రొటీన్ ప్రక్రియే, సీజేపీ నిరసనలకు సంబంధం లేదన్న పోలీసులు
- పరీక్షల అవకతవకలపై కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలు ఉధృతం
- జంతర్ మంతర్ వద్ద హింస.. నిరసనకారులపై టియర్ గ్యాస్ ప్రయోగం
- సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవల నిలిపివేత

నీట్ పరీక్షల అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలు - మిగతా 2 లో

## విద్యార్థుల పక్షాన మేం ఉన్నాం

గాంధీ స్మృతి వద్ద రాహుల్ గాంధీ నిరసన దీక్ష



- నీట్-యూజీ 2026 పేపర్ లీక్ బాధితులకు విపక్షాల మద్దతు
- గాంధీ స్మృతి వద్ద రాహుల్ గాంధీ నేతృత్వంలో నిరసన కార్యక్రమం
- మొబైల్ ఫ్లాష్‌లైట్లతో విద్యార్థులకు సంఘీభావం తెలిపిన ఎంపీలు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం

నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ వివాదంతో నష్టపోయిన - మిగతా 2 లో

## మన ఎర్రచందనాన్ని దేశంలో ఎక్కడ దాచినా వదలొద్దు



- ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని అధికారులకు పవన్ ఆదేశం
- స్మగ్లర్లతో పాటు కింగ్ పిన్‌లపైనా కఠిన చర్యలు తీసుకోవాలని సూచన
- నిఘా కోసం డ్రోన్లు, ఆధునిక టెక్నాలజీ వినియోగించాలని దిశానిర్దేశం
- గత రెండేళ్లలో 1239 మంది అరెస్ట్, 12 మందిపై పీడీ చట్టం ప్రయోగం
- స్మగ్లింగ్ కేసుల్లో 95 శాతానికి పెరిగిన శిక్షల రేటు అని తెలిపిన అధికారులు

రాష్ట్రంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను సమూలంగా నిర్మూలించాలని, అక్రమ రవాణాపై - మిగతా 2 లో

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ

ఏర్పాట్లపై మంత్రుల బృందం సమీక్ష



- ఆగస్టు 1న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం
- ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రి లోకేశ్ నేతృత్వంలో మంత్రుల సంఘం సమీక్ష
- ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశం
- ప్రధాని రాక సందర్భంగా విద్యార్థినులతో థింసా నృత్య ప్రదర్శనకు నిర్ణయం
- అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచన

విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ - మిగతా 2 లో

# భూ మోసాలకు ‘బ్లాక్‌చెయిన్’తో చెక్

- ట్యాంపర్ ప్రూఫ్ విధానానికి శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- భూ రికార్డుల భద్రత కోసం బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ వినియోగం
- ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ‘మీ భూమి-బ్లాక్‌చెయిన్’ పైలట్ ప్రాజెక్టు ప్రారంభం
- మొదటి దశలో 7 జిల్లాల్లోని 7 మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు
- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యమన్న సీఎం
- నవంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు సన్నాహాలు




ఆంధ్రప్రదేశ్‌లో భూ రికార్డుల నిర్వహణలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచి, మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు రూపొందించిన ‘మీ భూమి-బ్లాక్‌చెయిన్’ పైలట్

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి – విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి రానున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రుల బృందం ఆదేశించింది. మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన ఉండవల్లిలో ఈ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రుల సంఘం ఉండవల్లిలోని నివాసంలో అధికారులతో సమీక్షించింది. ఈ సందర్భంగా, విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమం కోసం తీసుకుంటున్న చర్యలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బహిరంగ సభా ప్రాంగణం, వేదిక నిర్మాణం, భద్రతాపరమైన అంశాలు, గ్యాలరీలు, గ్రీన్ రూమ్స్, జన సమీకరణ, పార్కింగ్, రవాణా, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి ఏర్పాట్లపై వారు మంత్రులకు తెలిపారు. అధికారుల వివరణ అనంతరం మంత్రుల సంఘం పలు కీలక సూచనలు చేసింది. ప్రధాని పర్యటన సందర్భంగా రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందులో భాగంగా, పెద్ద సంఖ్యలో విద్యార్థినులతో థింసా నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. అలాగే, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అరకు కాఫీ విశిష్టతను తెలిపేలా ప్రత్యేకంగా ఒక స్టాల్‌ను కూడా ఏర్పాటు చేయాలని చర్చించారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి, అల్లూరి సీతారామరాజు విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని మంత్రుల సంఘం అధికారులకు స్పష్టం చేసింది. ఈ సమావేశంలో మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, సత్యకుమార్ యాదవ్, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు ప్రధాని పర్యటన నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు

మొదటిపేజీ తరువాయి – గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థతో తనకు సంబంధాలు ఉన్నాయంటూ చేసిన ఆరోపణలపై 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పరువు నష్టం దావాతో పాటు సివిల్, క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని కేటీఆర్ తన నోటీసులో పేర్కొన్నారు. గ్లోబరీనా సంస్థలో తనకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు, యాజమాన్య హక్కులు లేదా బినామీ ప్రయోజనాలు లేవని ఆయన స్పష్టం చేశారు. సదరు సంస్థ తన బినామీ అని, సీబీఎస్‌ఈ కాంట్రాక్టులు ఇప్పించానని చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి, రాజకీయ ప్రత్యర్థిపై ఇటువంటి నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని కేటీఆర్ పేర్కొన్నారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే రాజకీయ దురుద్దేశంతోనే రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు.

## ఎల్‌నినో ఎఫెక్ట్.. ప్రతి వర్షపు చుక్కనూ కాపాడుకుందాం

మొదటిపేజీ తరువాయి – రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంలో తలెత్తిన ఈ మార్పుల దృష్ట్యా ప్రజలకు, రైతులకు నీటి ఎద్దడి రాకుండా అధికారులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఐఓసీ కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావం, తాగునీటి పరిస్థితులపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు హాజరయ్యారు. సమీక్ష సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తాగునీటి కొరతతో పాటు పశువులకు గ్రాసం లభించక ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు ఉన్నాయని అధికారులను హెచ్చరించారు. రాబోయే జూన్ నెల వరకు వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని వెల్లడించారు. ఈ కరవు పరిస్థితులను తట్టుకోవాలంటే రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలు వేసేలా అధికారులు వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. మరోవైపు రాష్ట్రంలో రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలమట్టాలను మళ్లీ పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందడుగు వేయాలని పొన్నం తెలిపారు. 'వీబీజీ రాంజీ' ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుని ప్రతి ఊరిలో పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల తవ్వకాలు చేపట్టాలని, పడిన ప్రతి వర్షపు బొట్టునూ వృథా కాకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా, పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతూ నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

## ప్రధాన్ రాజీనామాను బీఆర్‌ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదు?

మొదటిపేజీ తరువాయి – దమ్ముంటే ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. ఒకవేళ అది తప్పుడు ఫిర్యాదు అని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన ఓటు బదిలీ కోసం నిబంధనల ప్రకారం ఇప్పటికే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గతంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓట్లను తొలగించారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, అప్పటి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌పై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఓటర్ల జాబితా సవరణ పూర్తయిందని, ప్రక్షాళన నెపంతో ఓట్లు గల్లంతు కాకుండా ఉండేందుకు బీఎల్‌ఓలను నియమించినట్లు వివరించారు. ఓట్లు లేకపోతే ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించారు. హైడ్రా పనితీరుపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. ఈ సంస్థ ఇప్పటికే అనేక అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి కారణంగానే కేసీఆర్ గతంలో హరీశ్ రావును కొంతకాలం మంత్రి పదవికి దూరంగా ఉంచారని ఆరోపించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటర్‌మీడియట్ ఫలితాల వెల్లడిలో జరిగిన తప్పిదాల వల్ల 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో కేటీఆర్ తన నిజాయతీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలకు కారణమైన కేటీఆర్, ఇప్పటికైనా బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బీఆర్‌ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ఆయన నిలదీశారు.

## విద్యార్థుల పక్షాన మేం ఉన్నాం



మొదటిపేజీ తరువాయి – విద్యార్థులకు అండగా నిలుస్తూ ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు ఆందోళన చేపట్టారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో గురువారం సాయంత్రం ఢిల్లీలోని తీస్ జనవరి మార్గ్‌లో ఉన్న గాంధీ స్మృతి వద్ద వారు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ వివాదం కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు, నిరసనల్లో గాయపడిన వారికి సంఘీభావం ప్రకటించారు. అంతకుముందు, రాహుల్ గాంధీ నివాసంలో విపక్ష నేతలు సమావేశమయ్యారు. అనంతరం ప్రియాంక గాంధీ వాద్రాతో సహా పలువురు నేతలు బస్సుల్లో గాంధీ స్మృతికి చేరుకున్నారు. అక్కడ వారు తమ మొబైల్ ఫోన్ల ఫ్లాష్‌లైట్లను వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ఒక చేతిలో జాతీయ జెండాను, మరో చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని కనిపించారు. ఈ నిరసనపై రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. న్యాయం, జవాబుదారీతనం కోరుతున్న విద్యార్థులతో ప్రతిపక్షాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. "భారతదేశ విద్యార్థులు ఒంటరి కాదు. విద్యార్థుల పక్షాన నిలబడకుండా మమ్మల్ని ఎవరూ ఆపలేరు" అని పేర్కొన్నారు. నీట్ అక్రమాల తర్వాత ప్రాణాలు తీసుకున్న విద్యార్థులను స్మరించుకుంటూ, ఆందోళనల్లో గాయపడిన వారికి మద్దతుగా ఈ పోరాటం చేస్తున్నామని తెలిపారు. వాస్తవానికి విపక్షాలు ఇండియా గేట్ వరకు ప్రదర్శనగా వెళ్లాలని భావించినా, పోలీసులు అనుమతి నిరాకరించినట్లు సమాచారం. దీంతో రాహుల్ నివాసానికి కిలోమీటరు దూరంలోనే ఉన్న గాంధీ స్మృతి వద్ద నిరసన చేపట్టారు. మరోవైపు, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌కు కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ ఎంపీ కుమారి సెల్జా స్పష్టం చేశారు. నీట్-యూజీ 2026 పరీక్షలో పేపర్ లీక్, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువతలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), విద్యార్థి సంఘాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నాయి. ఈ నిరసనల నేపథ్యంలో పోలీసులు, విద్యార్థుల మధ్య ఘర్షణలు కూడా చోటుచేసుకున్నాయి. ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. తాజా విపక్షాల నిరసనతో ఈ అంశంపై రాజకీయ ఒత్తిడి మరింత పెరిగింది.

# మన ఎర్రచందనాన్ని దేశంలో ఎక్కడ దాచినా వదలొద్దు

మొదటిపేజీ తరువాయి – 'జీరో టాలరెన్స్' విధానాన్ని అత్యంత కఠినంగా అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి చెందిన ఎర్రచందనాన్ని దేశంలో ఏ మూలన దాచిపెట్టినా వదలొద్దని, స్మగ్లర్లతో పాటు వారి వెనుకున్న కింగ్ పిన్‌లపైనా ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ప్రత్యేకమైన అటవీ సంపద ఎర్రచందనం. దీనిని కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఎర్రచందనం స్మగ్లింగ్‌పై కూటమి ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుంది. నిఘాను పటిష్ఠం చేసేందుకు డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. స్మగ్లింగ్ ముఠాల నెట్‌వర్క్‌ను మూలాలతో సహా పెకిలించాలి" అని అన్నారు. ఇతర రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖ అధికారులతో తక్షణమే సమన్వయం పెంచుకోవాలని, దేశంలో ఎక్కడైనా అక్రమ నిల్వలు ఉంటే వాటిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. స్మగ్లింగ్ ముఠాలకు నిధులు సమకూర్చే ఫైనాన్షియర్లపైనా దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడంలో సాధించిన ప్రగతిని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కాలంలో మొత్తం 506 కేసులు నమోదు చేసి 1,239 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. స్మగ్లింగ్‌కు వినియోగించిన 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కీలకమైన 12 మంది ప్రధాన స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో స్మగ్లర్లపై పీడీ చట్టం ప్రయోగించలేదని గుర్తుచేశారు. అంతేకాకుండా, గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి, అక్కడి అధికారుల సమన్వయంతో 35.6 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి అంతర్రాష్ట్ర ఆపరేషన్లు జరగలేదని వారు పేర్కొన్నారు. ఈ చర్యల ఫలితంగా గతంలో 3 శాతం కంటే తక్కువగా ఉన్న శిక్షల రేటు (కన్విక్షన్ రేటు) ఇప్పుడు 95 శాతానికి పెరిగిందని, నిందితులకు కోర్టులు శిక్షలు విధించేలా పటిష్ఠమైన ఆధారాలు సమర్పిస్తున్నామని వివరించారు. అన్ని శాఖల సమష్టి కృషితో ఎర్రచందనం సంపదను కాపాడతామని అధికారులు ధీమా వ్యక్తం చేశారు.

# భూ మోసాలకు 'బ్లాక్‌చెయిన్'తో చెక్

మొదటిపేజీ తరువాయి – ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించడమే లక్ష్యంగా రెవెన్యూ శాఖ ఈ అత్యాధునిక టెక్నాలజీకి రూపకల్పన చేసింది. ఈ విధానం ద్వారా డబుల్ రిజిస్ట్రేషన్ల వంటి సమస్యలకు శాశ్వతంగా చెక్ పెట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, సరైన రికార్డులు లేకపోవడం వల్లే విలువైన భూముల విషయంలో మోసాలు, వివాదాలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో భూ తగాదాలు పెరిగాయని, 22ఏ నిబంధనను అడ్డుపెట్టుకుని కక్ష సాధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. తమ ప్రభుత్వం 'ప్రక్షాళన, విముక్తి, భద్రత' అనే మూడు సూత్రాల ఆధారంగా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు వంటి గ్రామాల్లో దశాబ్దాలుగా నలుగుతున్న భూ వివాదాలకు పరిష్కారం చూపిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రారంభించిన బ్లాక్‌చెయిన్ వ్యవస్థ ద్వారా భూములకు ట్యాంపర్ ప్రూఫ్ భద్రత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును ఎన్‌ఐసీ ఆంధ్రప్రదేశ్, బెంగళూరులోని ఎన్‌ఐసీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా 'హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్' టెక్నాలజీతో అభివృద్ధి చేశాయి. ఈ విధానంలో ప్రతి భూ కమతానికి ఒక ప్రత్యేక డిజిటల్ ఐడీని కేటాయించి, లావాదేవీలను అత్యంత భద్రంగా నమోదు చేస్తారు. దీనివల్ల రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలు ఒకే వేదికపైకి వచ్చి, భూ రికార్డులకు 'సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్' వ్యవస్థ ఏర్పడుతుంది. దీంతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రయవిక్రయాలు జరుపుకోవచ్చు. పైలట్ ప్రాజెక్టు కింద తొలి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఒక్కో మండలాన్ని ఎంపిక చేశారు. ఆస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లోని 89 రీ-సర్వే గ్రామాల్లో ఉన్న 1,37,763 ల్యాండ్ పార్సెల్స్ ఈ ప్రాజెక్టు పరిధిలోకి వస్తాయి. ఈ పైలట్ ప్రాజెక్టు అమలును రెండు నెలల పాటు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదుల కోసం ఒక ప్రత్యేక కంప్లైంట్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా వ్యవస్థలో మార్పులు చేసి, నవంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ హామీ.. గంటల్లోనే కార్యాచరణ

మొదటిపేజీ తరువాయి – న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఫాస్ట్-ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో నిందితులను కొత్తగా తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్-2024' కింద విచారించనున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చట్టం కింద దోషులుగా తేలిన వారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ కేసుల విచారణ కోసం తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. బాంబే, కలకత్తా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల పరిధిలో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న నాలుగు కేసులను ఈ ఫాస్ట్-ట్రాక్ కోర్టులకు బదిలీ చేయనున్నారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి ఈ కొత్త చట్టం కింద ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి. ఈ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను, హైకోర్టులను కేంద్రం అధికారికంగా కోరనుంది. రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా పరిష్కరించాలని ఈ అభ్యర్థనలో పేర్కొననుంది. నీట్‌తో పాటు యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్ వంటి ఇతర పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకేజీలు కూడా ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. యువత భవిష్యత్తు, సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. "యువత భవిష్యత్తును దెబ్బతీయాలని ప్రయత్నించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. దోషులకు కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# ఢిల్లీ పోలీసులకు ఎన్ఎస్ఏ అధికారాలు

మొదటిపేజీ తరువాయి – ఉద్రిక్తంగా మారుతున్న సమయంలో ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద ప్రత్యేక అధికారాలు కల్పిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులు చర్చనీయాంశమయ్యాయి. అయితే, ఇది ప్రతి మూడు నెలలకోసారి జరిగే సాధారణ పునరుద్ధరణ ప్రక్రియేనని, దీనికి కొనసాగుతున్న నిరసనలకు ఎలాంటి సంబంధం లేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఈ నెలలో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. 2026 జులై 19 నుంచి అక్టోబర్ 18 వరకు మూడు నెలల పాటు జాతీయ భద్రతా చట్టం-1980 కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసే అధికారాన్ని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు అప్పగించారు. ఈ నిర్ణయంపై పలు మీడియా సంస్థలు భిన్న కథనాలు ప్రచురించాయి. సీజేపీ నిరసనలను అణచివేసేందుకే ఈ అధికారాలు ఇచ్చారని వార్తలు రావడంతో ఢిల్లీ పోలీసులు నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. "కొన్ని మీడియా సంస్థలు నివేదిస్తున్నట్లుగా, సీజేపీ నిరసనలను అణిచివేసేందుకు పోలీస్ కమిషనర్‌కు ఎన్ఎస్ఏ అధికారాలు ఇచ్చారనడంలో వాస్తవం లేదు. ఇది కేవలం రొటీన్ పరిపాలనా ప్రక్రియ. జులై 19 నుంచి అక్టోబర్ 18 వరకు అధికారాల పునరుద్ధరణ కోసం జులై 7వ తేదీనే ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీజేపీ నిరసనలు తీవ్రరూపం దాల్చడానికి ముందే ఈ ప్రక్రియ పూర్తయింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యేకంగా ఎలాంటి అభ్యర్థన చేయలేదు. మీడియా ఈ ఉత్తర్వులను తప్పుగా అన్వయించుకుంది" అని ఢిల్లీ పోలీసులు తమ ప్రకటనలో వివరించారు.

### ఉద్రిక్తంగా మారిన సీజేపీ నిరసనలు

పరీక్షల్లో అవకతవకలకు నిరసనగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యువత పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు. బోస్టన్ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ అభిజీత్ దిప్కే సోషల్ మీడియాలో వ్యంగ్యంగా ప్రారంభించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' ప్రచారం, ఇప్పుడు దేశవ్యాప్తంగా యువత నేతృత్వంలోని ఉద్యమంగా మారింది. జూన్ 20న జంతర్ మంతర్ వద్ద ప్రారంభమైన ఈ నిరసన, జూన్ 28న పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్షతో మరింత ఉద్ధృతమైంది. గత వారాంతంలో ఆరోగ్యం క్షీణించగా ఆయన్ను బలవంతంగా సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించడంతో ఆందోళనలు తీవ్రమయ్యాయి. నిన్న రాత్రి జంతర్ మంతర్ సమీపంలోని సంసద్ మార్గ్ వద్ద పరిస్థితులు హింసాత్మకంగా మారాయి. నిరసనకారులు, భద్రతా సిబ్బంది మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు రువ్వగా, వారిని చెదరగొట్టేందుకు ఢిల్లీ పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) బలగాలు టియర్ గ్యాస్ ప్రయోగించాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో అధికారులు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.

# ప్రపంచ అనిశ్చితుల మధ్యా భారత్ బలంగా ముందుకు సాగుతోంది

మొదటిపేజీ తరువాయి – పనితీరు బలంగానే ఉందని జులై బులెటిన్‌లో వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు కొన్ని ప్రాంతాల్లో అసమానంగా కురుస్తున్నప్పటికీ.. తగినన్ని ఆహార ధాన్య నిల్వలు ఉండటంతో ఆహార ద్రవ్యోల్బణంపై ప్రభావం పరిమితంగానే ఉండొచ్చని తెలిపింది. 2026-27 తొలి త్రైమాసికంలో ఎగుమతులు, దిగుమతులు గణనీయంగా పెరగడంతో విదేశీ వాణిజ్యం బలంగా కొనసాగుతోందని పేర్కొంది. ఇటీవల అమల్లోకి వచ్చిన భారత్-బ్రిటన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం, ఇతర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల్లో పురోగతి దీనికి మరింత ఊతమివ్వొచ్చని అంచనా వేసింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ), విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పీఐ) పెరగడం దేశ ఆర్థిక వ్యవస్థపై పెట్టుబడిదారుల విశ్వాసం తిరిగి బలపడుతున్న సంకేతమని ఆర్‌బీఐ పేర్కొంది. జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం స్వల్పంగా పెరిగినా, ప్రధాన ఇన్‌ఫ్లేషన్ మాత్రం దిగువ స్థాయిలోనే ఉందని వెల్లడించింది. దేశీయ డిమాండ్, పారిశ్రామిక, సేవారంగాల స్థిరమైన పనితీరు కారణంగా ప్రపంచ సవాళ్లను భారత్ సమర్థంగా ఎదుర్కొంటోందని, విదేశీ రంగానికి సంబంధించిన కీలక సూచీలు కూడా స్థిరంగా ఉన్నాయని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

# పీఓకే ప్రధాని కావాలనుకుంటున్నా: నవాజ్ షరీఫ్ సంచలన ప్రకటన



మొదటిపేజీ తరువాయి – ప్రధాని కావాలని ఉందంటూ ఎవరూ ఊహించని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ముజఫరాబాద్‌లో జరిగిన ఒక భారీ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన ఆయన, అక్కడ తమ పార్టీ గెలిస్తే తన సోదరుడు, ప్రస్తుత పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కోరి మరీ పీఓకే ప్రధాని బాధ్యతలు చేపడతానని ప్రకటించారు. పీఓకే ప్రాంత అభివృద్ధిని స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించేందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు నవాజ్ షరీఫ్ చెప్పారు. పంజాబ్ ప్రావిన్స్ తనకు ఎంత ముఖ్యమో పీఓకే కూడా అంతే ప్రాధాన్యత కలిగినదని వ్యాఖ్యానించారు. తమ పూర్వీకులు కశ్మీర్ ప్రాంతం నుంచే వలస వచ్చారని, అందుకే పీఓకే తనకు రెండో స్వగ్రామంతో సమానమని చెప్పుకొచ్చారు. ఒకవేళ తాను ప్రధానిని కాకపోయినా ప్రతి మూడు నెలలకోసారి అక్కడ పర్యటించి అభివృద్ధి పనులను సమీక్షిస్తానని హామీ ఇచ్చారు. అయితే, నవాజ్ షరీఫ్ ఈ తరహా ప్రకటనలు చేయడం వెనుక పీఓకేలో ప్రస్తుతం నెలకొన్న తీవ్ర నిరసనలే ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆకాశాన్నంటిన ద్రవ్యోల్బణం, విపరీతమైన విద్యుత్ ఛార్జీలు, వీఐపీ సంస్కృతికి వ్యతిరేకంగా జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జీఖజీూాజ) ఆధ్వర్యంలో పీఓకే వ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. పాకిస్థాన్ ప్రభుత్వ నిర్బంధ చర్యలు, ఘర్షణల కారణంగా ఇప్పటివరకు అక్కడ 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడంతో పరిస్థితి అత్యంత ఉద్రిక్తంగా మారింది. ఎన్నికలు జరుగుతున్న వేళ ప్రజల తీవ్ర ఆగ్రహం నుంచి తప్పించుకునేందుకే నవాజ్ షరీఫ్ ఇలాంటి హామీల డ్రామాడుతున్నారని భావిస్తున్నారు. మరోవైపు, పీఓకేలో జరుగుతున్న ఈ పరిణామాలపై భారతదేశం తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. జమ్మూకశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు మొత్తం భారతదేశంలో విడదీయరాని అంతర్భాగాలని తేల్చిచెప్పింది. అక్కడ పాకిస్థాన్ అక్రమంగా, బలవంతంగా భూభాగాలను ఆక్రమించిందని, ఆక్రమిత ప్రాంతాల్లో పాక్ నిర్వహించే ఎలాంటి ఎన్నికలను లేదా అక్కడి తాత్కాలిక అసెంబ్లీలను భారత్ గుర్తించదని స్పష్టం చేసింది.

# ఆగస్టు 7న బెంగళూరులో జాతీయ ఓబీసీ మహాసభలను విజయవంతం చేయాలి...!

నల్ల మధు యాదవ్ బీసీ విద్యార్థి సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు

సాగర్ల కరుణాకర్ యాదవ్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ అధ్యక్షులు

నీలకంఠం నాగరాజ్ నాగార్జున ప్రభుత్వ కళాశాల అధ్యక్షులు




**ప్రతినిధి కురుపాటి గణేష్ నల్లగొండ జిల్లా జూలై 23 (అఖండ భూమి న్యూస్):** నల్లగొండ జిల్లా బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ నాగార్జున ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో ఆగస్టు 7న బెంగళూరులో నిర్వహించనున్న జాతీయ ఓబీసీ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించడం జరిగింది..ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు నల్ల మధు యాదవ్ మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా ఓబీసీల సామాజిక, విద్యా, రాజకీయ హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు..దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో ఓబీసీ కుల గణనను తప్పనిసరిగా చేపట్టాలి..మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా కల్పించాలి..జనాభా నిష్పత్తి ప్రకారం ఓబీసీలకు రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలి..పార్లమెంట్, అసెంబ్లీలు మరియు ఇతర చట్టసభల్లో ఓబీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విధంగా రాజకీయ రిజర్వేషన్లను అమలు చేయాలి..ఓబీసీల హక్కుల సాధన, సామాజిక న్యాయం మరియు రాజ్యాంగబద్ధమైన అవకాశాల కోసం జరుగుతున్న ఈ జాతీయ మహాసభలకు నల్లగొండ జిల్లాలోని విద్యార్థి నాయకులు, యువజన నాయకులు, మహిళా సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు మరియు బీసీ ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం పక్షాన విజ్ఞప్తి చేస్తున్నాము..ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు అనుముల మనోజ్, నల్లబోతు మధు, పాలకూరి నవీన్, సాయి యాదవ్, జాల పవన్ యాదవ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలి

మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నెం నాగేంద్ర వర్మ ..



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; జూలై 23 (అఖండ భూమి న్యూస్):** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు వెన్నెముక వంటిదని, ప్రతి అర్హ పౌరుడు తన ఓటు హక్కును కాపాడుకోవడానికి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని దోమకొండ మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు . పిన్నెం నాగేంద్ర వర్మ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమం ఓటరు జాబితాలను పూర్తిగా పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఎంతో కీలకమైనదని అన్నారు. ఓటరు జాబితాలో తమ పేరు సక్రమంగా ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సవరణలు చేయించుకోవాలని సూచించారు.కొత్తగా ఓటు హక్కు పొందిన యువత తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని, చిరునామా మార్పు, పేరు లేదా ఇతర వివరాల్లో పొరపాట్లు ఉన్న వారు అవసరమైన పత్రాలతో సవరణలు చేయించుకోవాలని తెలిపారు. ఓటరు జాబితాలో నమోదు, సవరణ, ధృవీకరణ ప్రక్రియలను ఆలస్యం చేయకుండా పూర్తి చేసుకోవడం ద్వారా భవిష్యత్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అత్యంత అవసరమని, ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన విలువైన హక్కు అని నాగేంద్ర వర్మ అన్నారు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించడం రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు, కార్యకర్తలందరి బాధ్యత అని పేర్కొన్నారు. పట్టణంలోని అన్ని వార్డులు, కాలనీల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, ఒక్క అర్హ ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రతి ఓటరు తన ఓటు హక్కును పరిరక్షించుకోవాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్టం చేయాలని పిన్నెం నాగేంద్ర వర్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మహాత్మా జ్యోతిబాపూలే ఎం జే పీ హాస్టల్లో విద్యార్థులకు ఫుడ్ ఇన్ఫెక్షన్





**బెల్లంపల్లి జూలై 23 (అఖండ భూమి న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఎంజేపీ హాస్టల్లో బుధవారం రాత్రిసుమారు 10 గంటల సమయంలో కొంతమంది విద్యార్థులకి ఫుడ్ ఇన్ఫెక్షన్ కావడం వలన వారిని స్థానిక బెల్లంపల్లిలోని వంద పడకల ఆసుపత్రికి తరలించడం జరిగింది.ఇట్టి విషయం తెలిసిన వెంటనే భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్,బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు దార కళ్యాణి, భీమిని మండలం అధ్యక్షులు కొంక సత్యనారాయణ హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి అస్వస్థతకు గురైన విద్యార్థులను కలిసి వారి ఆరోగ్యం పరిస్థితి అడిగి తెలుసుకోవడం జరిగింది.అదే విదంగా అందుబాటులో వున్న పిల్లల తల్లి దండ్రులతో మాట్లాడి ధైర్యం చెప్పడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ..హాస్టల్ ప్రిన్సిపాల్ కి ఫోన్ చేసి విషయం తెలుసుకోడానికి మేము ప్రయత్నించగా ప్రిన్సిపాల్ ఫోన్ కూడా లిఫ్ట్ చేయలేదన్నారు.అందువల్ల వెంటనే సంబంధిత అధికారులు ఈ హాస్టల్ కు సంబంధించి అక్కడి పరిసరాలు ఎలా ఉన్నాయని చూసి ఈ పిల్లల అనారోగ్యానికి కారణమైన పరిస్థితులను నిర్ధారించి అక్కడి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏరోజు శ్రీనివాస్ స్రవంతి గారు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దగ్ధం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; జూలై 23 (అఖండ భూమి న్యూస్):** మొన్న కావాలని దూరుద్దేశంతో శాంతి భద్రతలు విఘాతం కల్గించడం కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రధాన మంత్రి ఇంటిని ముట్టడించడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దగ్ధం చేసే ప్రయత్నం చేస్తే పట్టణ పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నం చేసినప్పటికీ బీజేపీ శ్రేణులు దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశం ప్రారంభమైన తర్వాత దేశానికి ఉపయోగపడే బిల్లులు ఆమోదించే క్రమంలో గౌరవ నరేంద్ర మోదీ పని చేస్తుంటే, కావాలని శాంతి భద్రతలు విఘాతం కలిగించాలనే దురుద్దేశంతో రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రధాని ఇంటిని ముట్టడించడం దురదృష్టకరం. దేశ విద్రోహ శక్తులను ఉసిగొల్పి దేశంలో అశాంతి నెలకొల్పడమే కాంగ్రెస్ ముఖ్య ఉద్దేశం అని, నీట్ పరీక్షల ముసుగులో కాంగ్రెస్ మరియు ఇతర ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయాలను అందరూ గమనిస్తున్నారు. నీట్ ను అడ్డుపెట్టుకొని కమ్యూనిస్టులు, దేశ వ్యతిరేక శక్తులు దేశాన్ని విడగొట్టాలని కుట్రలు చేస్తున్నారనీ ఆర్టికల్ 370 ని మళ్లీ తీసుకురావాలని, ఆర్ఎస్ఎస్ ను బ్యాన్ చేయాలని మాట్లాడుతున్నారు. అసలు సనాతన ధర్మానికి, ఆర్ఎస్ఎస్ కు మరియు నీట్ పరీక్షలకు సంబంధం ఏంటి? అని ప్రశ్నించారు. ఇది నవ భారతం, మోదీ గారి భారతం. ఇలాంటి విచ్ఛిన్నకర శక్తుల కుట్రలకు బీజేపీ ఏమాత్రం భయపడదనీ, మోదీ గారిని బలహీనపరుస్తామనే పగటి కలలు కనడం రాహుల్ గాంధీ గారు ఇకనైనా మానుకోవాలనీ హితవు పలికారు. సీనియర్ సిటిజన్ వయస్సుకు దగ్గర పడుతున్న ఆయన కాస్త పరిణితితో ప్రవర్తిస్తే మంచిదనీ ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ పై దాడిని ఖండిస్తూ శాంతియుత నిరసన...!

**ప్రతినిధి కురుపాటి గణేష్ చండూరు మండలం జూలై 23 (అఖండ భూమి న్యూస్):** ర్యాలీ నిరసన కార్యక్రమాలు మోడీ నిరంకుశ పాలన యువత పట్ల నిర్లక్ష్య ధోరణి కి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువతపై అర్థరహితంగా అరాచకంగా పాషవికంగా దాడి చేయగా, గాయాలైన యువతకు మద్దతు తెలిపిన మా నాయకుడు కాబోయే నవయుగ భారతదేశానికి దిక్సూచి లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మా జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేని నాయకురాలు ప్రియాంక గాంధీని అరెస్ట్ చేసినందుకు మునుగోడు నియోజకవర్గ శాసనసభ్యులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి పిలుపు మేరకు నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరు మండల కేంద్రంలో చండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేకల సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో నందు నిరసన కార్యక్రమాలు చేయడం జరిగింది..అంతే కాకుండా మోడీ ని సూటిగా ప్రశ్నిస్తూ మా యువత వల్లే టీ అమ్ముకునే నీవు ప్రధానివి అయినావు, ప్రతి ఫలంగా ఉద్యోగాలు, ఉపాధి చూపించమని అడిగితే నాలాగే టీ లు అమ్ముకోమంటివి, బజ్జిలు అమ్ముకోమంటివి, ఆటో తోలుకొమంటివి, కూలిపని చేసుకోమంటివి అయినా నీ మాటకు విలువ ఇచ్చినాము..కాని టీ, బజ్జీలు అమ్ముకొని ఆటో తోలుకొని కూలి పనులు చేసుకుని మా






బిడ్డలను కష్టపడి చదివించి డాక్టర్లు చేద్దాం అనుకుంటే నువ్వు మోసం చేసి మా బలహీనవర్గాల, దళిత, గిరిజన, హరిజన, బహుజన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మరియు అగ్రవర్ణకుల పేద బిడ్డల భవిష్యత్తును కాలరాస్తూ నీట్ పేపర్ లీక్ చేసి నీ కోటరీ, నీ పరివారానికి, జై మోడీ, జై బిజెపి జై ఆర్ ఎస్ ఎస్, కుల మత జాతి వ్యతిరేకులైన జైశ్రీరామ్ అన్నవారికి పేపర్ అమ్ముకొని, ఆపరేషన్ కత్తికి ఆయువు తీసే కత్తికి తేడా తెలియని వారిని డాక్టర్లు చేయాలని చూస్తున్నావు, మా నాయకులు ప్రతిభ ఉన్నవారిని డాక్టర్లు చేయమని అన్నందుకు రాహుల్ గాంధీని, మల్లికార్జున ఖర్గేని, ప్రియాంక గాంధీని అరెస్టు చేస్తా ఉన్నావు..అసలు అరెస్టు చేయాల్సింది ఎగ్జామ్ కూడా నిర్వర్తించలేని దేశ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాని, మళ్లీ మళ్లీ పరీక్షలు నిర్వర్తించడానికి నిధులు విడుదల చేస్తున్న నిర్మల సీతారామన్ ని, పేపర్ లీక్ ల నివారించలేను ఇంటలిజెంట్ విభాగం సంబంధించిన హోంశాఖ అమిత్ షాని, అందరికి బాసు ఐన మోడీని అరెస్టు చేసి అండమాన్ జైలులో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది..మా యువత వల్లనే గద్దెను ఎక్కి మళ్ళీ మళ్ళీ ప్రజాస్వామికంగా ఈవీఎం ట్యాంపరింగ్ చేసి గద్దెనెక్కిన మా యువత సహించింది..కానీ ఈరోజు మా పొట్ట కొట్టి, మా తలరాతను మార్చాలని చూస్తున్న మోడీ నీ తలరాతన మార్చి మా వల్లనే నీవు జైలు పాలు కాక తప్పదు అని హెచ్చరిస్తూ ఖబర్దార్ మోడీ...

# ఏఐటియుసి మంచిర్యాల జిల్లా మహాసభల జయప్రదం చేయండి




**బెల్లంపల్లి జులై 23(అఖండ భూమి న్యూస్):** మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలోని భగత్ సింగ్ భవన్ లో గురువారం ఏఐటియుసి తాండూర్ మండల మహాసభ నిర్వహించడం జరిగిశీది.ఈ సభ కొండు బానేష్ అధ్యక్షతన జరిగినది.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ...కార్మికుల హక్కుల కోసం నిరంతరం రాజీ లేని సమరశీల పోరాటాలు చేస్తూ దేశంలో ఏర్పడ్డ మొట్టమొదటి కార్మిక సంఘం (ఏఐటీయూసీ)అన్నారు.భారతదేశాన్ని బ్రిటిష్ వారు పరిపాలిస్తున్న సమయంలోనే దేశంలోని కార్మికులను ఐక్యపరిచి 1920 అక్టోబర్ 31న బొంబాయి నగరంలో (ఏఐటీయూసీ) ఆవిర్భవించిందన్నారు.నాటి నుంచి నేటి వరకు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నడుపుతుంది. కనీస వేతనాలు చట్టం.సంగం పెట్టుకునే హక్కు.సమ్మె చేసే హక్కు. (ఏఐటీయూసీ)పోరాటాల వల్లనే వచ్చినవి.ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పెట్టుబడి దారులకు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్పులు చేస్తూ 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్ లుగా మార్చి కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ పేరుతో కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తూ వ్యక్తి చాకిరి చేస్తున్నారు. కనీసం వేతనాలు పిఎఫ్.ఈఎస్ఐ పట్టాలు అమలుకు నోచుకోలేదన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టాలు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలం అయ్యారు. అంగన్వాడి ఏఎన్ఎం,ఆశ,ఆర్టీసీ, మధ్యాహ్న భోజనం,జీపు,కారు, 108,104,హాస్పటల్ కార్మికులు. హమాలీ,ఆటో,భవన నిర్మాణ రంగం, గ్రామపంచాయతీ కార్మికులు,లారీ డ్రైవర్లు,పెయింటింగ్,సెంట్రింగ్ స్టైల్స్, మార్బుల్ అలాగే ఇతర రంగాల కార్మికుల వేతనాలు పెరగక ఉపాధి దొరకక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కనీస వేతన చట్టాలు అమలు చేయాలని,ఏఐటియుసి తాండూర్ మండల కన్వీనర్ గా తాని శ్రీనివాస్ ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భయ్యా మొగిలి, ఏఐటియుసి గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షులు సాలీగామా సంతోష్, వాసాల నాగరాజు,పట్టి శంకర్,దాసరి లక్ష్మి,కొండు సాయికుమార్,కుర్సింగ తిరుపతి,మీసాల సన్యాసి,గాజుల దేవయ్య,ముత్తె శంకర్,పెద్ద బోయిన చందు,ఉట్నూరి అంకేష్,పెద్ద బోయిన లక్ష్మణ్,పెద్ద బోయిన మహేందర్, మంచర్ల వెంకటేష్,ధర్మరాజుల అభిరామ్,పెద్ద బోయిన మనోహర్, ఎలిగేటి భీమేష్,కమ్మరి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు...

# వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ

– యం. రాజేష్ చంద్ర,

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 23 (అఖండ భూమి న్యూస్): జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, వార్షిక తనిఖీల్లో భాగంగా తాడ్వాయి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా యెల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, సీఐ సంతోష్ కుమార్, తాడ్వాయి ఎస్‌హెచ్‌ఓ నరేష్ ఎస్పీ కి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ యూనిఫాం టర్నౌట్‌ను పరిశీలించి, సిబ్బందితో సమావేశమై విధి నిర్వహణ, క్రమశిక్షణ, ప్రజాసేవలపై సమీక్ష నిర్వహించారు. అధికారులకు ఇచ్చిన సూచనలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉందా లేదా అన్నది స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తదుపరి పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, లాకప్, బ్యారెక్స్, టెక్నికల్ రూమ్, స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు, సీజ్ చేసిన వాహనాల వివరాలు, స్టేషన్ భౌగోళిక మ్యాప్, క్రైమ్ హాట్‌స్పాట్స్ తదితర అంశాలను పరిశీలించారు. పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిపై ఎస్‌హెచ్‌ఓను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో కేసుల నమోదు విధానం, ఆన్‌లైన్ సిసిటిఎన్ఎస్ వ్యవస్థ పనితీరు, ఫిర్యాదుదారులను స్వీకరించే విధానం, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. ప్రతి పిటిషన్‌ను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యను పూర్తిగా తెలుసుకొని చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో పోలీసులపై విశ్వాసం, భద్రత, భరోసా పెంపొందేలా పనిచేయాలని తెలిపారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకొని వెంటనే స్పందించాలని, ప్రతి విలేజ్ పోలీస్ ఆఫీసర్ తమకు కేటాయించిన గ్రామాన్ని నిరంతరం సందర్శిస్తూ గ్రామస్థాయిలో సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, యువతలో చట్టాలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను గ్రామాల్లో నిర్వహించాలని ఆదేశించారు. ప్రధాన రహదారులపై ప్రమాద హాట్‌స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజిబుల్ పోలీసింగ్, నిరంతర పెట్రోలింగ్ ద్వారా శాంతిభద్రతలు పటిష్టంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దొంగతనాల నివారణకు ముందస్తు నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని, పాత నేరస్తులు, సస్పెక్ట్ వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, కేసుల డిటెక్షన్‌ను వేగవంతం చేయాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను దృష్టిలో






ఉంచుకొని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ, గణేష్ మండపాల వద్ద భద్రత, నిర్వాహక కమిటీలతో సమన్వయం తదితర అంశాలపై ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యెల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, సీఐ సంతోష్ కుమార్, తాడ్వాయి ఎస్‌హెచ్‌ఓ నరేష్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## షబ్బీర్ అలీ కలిసిన పెద్ద మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు

అబ్రబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ బ్యూరో ఇంచార్జ్ కామారెడ్డి..

**కామారెడ్డి బ్యూరో; జూలై 23 (అఖండ భూమి న్యూస్):** హైదరాబాదులోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దమల్లారెడ్డి గ్రామానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలను నాయకులు శ్రీ షబ్బీర్ అలీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను శ్రద్ధగా విన్న శ్రీ షబ్బీర్ అలీ గారు వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని శ్రీ షబ్బీర్ అలీ గారు నాయకులకు హామీ ఇచ్చారు.



## రాముడిని, మోదీ గారిని తిట్టడమే నిరసన...!



పాకిస్తాన్ మాజీ క్రికెటర్డానిష్ కనేరియా..

కామారెడ్డి జిల్లా ప్రతినిధి; జూలై 23 (అఖండ భూమి న్యూస్): భారత్లో ప్రతి నిరసనకూ ఒకే స్క్రిప్ట్ ఉంటోందని పాక్ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా విమర్శించారు 'రాముడు, భారతమాత, హిందుత్వం, మోదీ, ఆయన తల్లిని తిడుతున్నారు. చర్చలు, పరిష్కారాల్లేవు. నినాదాలు, దూషణలు, గందరగోళమే ఉన్నాయి. నేపాల్ వంటి పరిస్థితి వస్తుందని అపొజిషన్ కలలు కంటోంది. అమెరికాతో ట్రేడ్ డీల్ జరగకముందే కొందరు రైతులు ఢిల్లీని బ్లాక్ చేసేందుకు వెళ్లడం ఏంటో.?

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మదన్ మోహన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; జూలై 23 (అఖండ భూమి న్యూస్):** ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట్ మండలం , మోతే గ్రామంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను ఎమ్మెల్యేలిమదన్ మోహన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.అత్యాధునిక సౌకర్యాలతో విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక విద్యా సంస్థను నిర్మిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వసతి గృహాలు, క్రీడా మైదానాలు, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు వంటి అన్ని మౌలిక వసతులు అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పూర్తయిన తర్వాత ఎల్లారెడ్డి నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక విద్య అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, ఇంజినీర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## దోమకొండలో కాంగ్రెస్ పార్టీ ధర్నా.. అడ్డుకున్న పోలీసులు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; జూలై 23 (అఖండ భూమి న్యూస్):** కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా దోమకొండలో అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నీట్ పరీక్షలో లీకులకు కారణమైన కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి వెంటనే , కేంద్ర విద్యా శాఖ మంత్రి, ప్రధానమంత్రి వెంటనే బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం దోమకొండ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ను అక్కడినుండి పంపించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆశ బోయిన శ్రీనివాస్, సర్పంచ్ ఐరన్ నరసయ్య, తీగల తిరుమల గౌడ్, అనంతరెడ్డి, సీతారాం మధు, తాటిపల్లి శ్రీకాంత్, పిన్నం నాగేంద్ర వర్మ, కదిరే గోపాల్ రెడ్డి, షమ్మీ, మహమ్మద్, మాజీ వార్డు సభ్యులు అబ్రబోయిన రాజేందర్, సాయబు గారి రాజు, మహీం, అబ్రబోయిన సత్తయ్య, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## షబ్బీర్ అలీ కలిసిన పెద్ద మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; జూలై 23 (అఖండ భూమి న్యూస్);** హైదరాబాదులోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దమల్లారెడ్డి గ్రామానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలను నాయకులు శ్రీ షబ్బీర్ అలీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను శ్రద్ధగా విన్న శ్రీ షబ్బీర్ అలీ గారు వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని శ్రీ షబ్బీర్ అలీ గారు నాయకులకు హామీ ఇచ్చారు.

# మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఖమ్మం జగ్గయ్యపేట కూడలి వరకూ భారీ ర్యాలీ...



**బోనకల్, జూలై 23 (అఖండ భూమి న్యూస్):** ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా విద్యార్థుల జీవితాలను కేంద్ర ప్రభుత్వం ప్రమాదంలోకి నెడుతోందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కర్నాటి రామ కోటేశ్వరరావు ఆరోపించారు. గురువారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఖమ్మం- జగ్గయ్యపేట ప్రధాన కూడలి వరకు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీ ఎత్తున నిరసన ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ అంశంపై మండల కాంగ్రెస్ అధ్యక్షులు కర్నాటి రామ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులు, కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీనీ మరియు ప్రజా సంఘాల నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి అరెస్టులకు పాల్పడడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని విమర్శించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటన నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబాలకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేడు బిజెపి అవలంబిస్తున్న నిరంకుశ పాలనకు ప్రజలు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాలే అందుకు నిదర్శనం అన్నారు. బిజెపి చేపడుతున్నా ఈ కార్యక్రమాలకు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు... ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ ఇన్చార్జిలు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,ఆత్మ కమిటీ డైరెక్టర్లు,ఆయా గ్రామాల సర్పంచులు,గ్రామ శాఖ అధ్యక్షులు,మాజీ ప్రజా ప్రతినిధులు,యువజన కాంగ్రెస్ నాయకులు,గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున నిరసన ర్యాలీలో పాల్గొన్నారు...

# స్త్రీ శక్తి భవనానికి భూమి పూజ చేసిన సర్పంచ్ -- కర్లకుంట సులోచన దావీదు...



**బోనకల్ జూలై 23 (అఖండ భూమి న్యూస్):** జానకిపురం గ్రామంలో నేడు గ్రామ మహిళా సమాఖ్య నూతన భవనానికి భూమి పూజ చేసిన సర్పంచ్ కర్లకుంట సులోచనదావీదు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ మన ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రతినెల సంఘ సభ్యుల సమావేశాన్ని నిర్వహించుకొనుటకు ప్రత్యేకమైన భవనాలు ఉండాలా అని సంకల్పించి మహిళల సంఘాల అభివృద్ధికి వారి సమావేశాలు నుంచి నివృత్తి చేసుకోవడానికి ఒక ప్రత్యేకమైన భవనాన్ని ఏర్పాటు చేయటం మన ప్రభుత్వానికి ఎంతో కృతజ్ఞతలు తెలుపుతున్నాము అలాగే గ్రామ మహిళా సమైక్య సభ్యులు కూడాను ఇటువంటి ప్రత్యేక భవనాలను ఉండటం ఎంతో సంతోషదాయకమని ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలోని జిపి సెక్రెటరీ కెన్నేధర శ్రీనివాస్ ఉపసర్పంచ్ గంగాధరి భూపతిరావు మాజీ జడ్పిటిసి, బోనకల్ ఉపసర్పంచ్ బానోతు కొండ వార్డ్ మెంబర్ చిలక శివ గ్రామ పెద్దలు ఆర్టిడి ఏఎస్ఐ కర్లకుంట దావీదు గోగుల కృష్ణ చిలక ఏసురత్నం తోటకూర అనంత రాములు కోట హనుమంతురావు గంగాధరి పెద్ద కృష్ణయ్య ఐకెపి మండల అధికారులు జి పి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మొర్లా శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరావు



**బోనకల్ జూలై 23 (అఖండ భూమి న్యూస్):** బోనకల్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన మొర్లా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను బోనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరావు, బిసి సెల్ మండల అధ్యక్షులు కందుల పాపారావు , బోనకల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటపల్లి స్వామి, ఆత్మ కమిటీ డైరెక్టర్ నల్లమోతు సత్యనారాయణ, పరామర్శించారు. వారి నివాసానికి వెళ్లి శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రీనివాసరావు అందరితో కలిసి మెలిసి ఉండే మంచి వ్యక్తి అని, ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా గ్రామ ప్రజలతో ఆప్యాయంగా మెలిగేవారని అన్నారు. ఆయన అకాల మరణం గ్రామానికి, కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. భగవంతుడు శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలోబోనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరావు, బిసి సెల్ మండల అధ్యక్షులు కందుల పాపారావు , బోనకల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటపల్లి స్వామి, ఆత్మ కమిటీ డైరెక్టర్ నల్లమోతు సత్యనారాయణ, నివాళులర్పించారు.

# ఆగస్టు 7న బెంగళూరులో జాతీయ ఓబీసీ మహాసభలను విజయవంతం చేయాలి...!

నల్ల మధు యాదవ్ బీసీ విద్యార్థి సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు

సాగర్ల కరుణాకర్ యాదవ్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ అధ్యక్షులు

నీలకంఠం నాగరాజ్ నాగార్జున ప్రభుత్వ కళాశాల అధ్యక్షులు




**ప్రతినిధి కురుపాటి గణేష్ నల్లగొండ జిల్లా జూలై 23 (అఖండ భూమి న్యూస్):** నల్లగొండ జిల్లా బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆగస్టు 7న బెంగళూరులో నిర్వహించనున్న జాతీయ ఓబీసీ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించడం జరిగింది.. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు నల్ల మధు యాదవ్ మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా ఓబీసీల సామాజిక, విద్యా, రాజకీయ హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు..దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో ఓబీసీ కుల గణనను తప్పనిసరిగా చేపట్టాలి..మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా కల్పించాలి..జనాభా నిష్పత్తి ప్రకారం ఓబీసీలకు రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలి..పార్లమెంట్, అసెంబ్లీలు మరియు ఇతర చట్టసభల్లో ఓబీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విధంగా రాజకీయ రిజర్వేషన్లను అమలు చేయాలి..ఓబీసీల హక్కుల సాధన, సామాజిక న్యాయం మరియు రాజ్యాంగబద్ధమైన అవకాశాల కోసం జరుగుతున్న ఈ జాతీయ మహాసభలకు నల్లగొండ జిల్లాలోని విద్యార్థి నాయకులు, యువజన నాయకులు, మహిళా సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు మరియు బీసీ ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం పక్షాన విజ్ఞప్తి చేస్తున్నాము..ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు అనుముల మనోజ్, నల్లబోతు మధు, పాలకూరి నవీన్, సాయి యాదవ్, జాల పవన్ యాదవ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేయాలి

మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని కలసిన అరకు మాజీ ఎంపీ దంపతులు

చిన్న కుమార్తెను ఆశీర్వదించిన "వైయస్ జగన్మోహన్ రెడ్డి"



**కొయ్యూరు అల్లూరు జిల్లా జూలై 23 (అఖండ భూమి న్యూస్):** జిల్లాలో వైఎస్ఆర్సిపి పార్టీ మరింత బలోపేతం చేసేందుకు విస్తృతంగా కృషి చేయాలని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దిశా నిర్దేశం చేశారని అరకు మాజీ ఎంపీ వైసీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొడ్డేటి మాధవి తెలిపారు. తాడేపల్లి జగన్మోహన్ రెడ్డి స్వగృహంలో మర్యాదపూర్వకంగా గొడ్డేటి మాధవి దంపతులు కుటుంబ సమేతంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య జిల్లా తాజా రాజకీయాల పట్ల సుదీర్ఘంగా చర్చించడం జరిగిందని మాధవి తెలిపారు. వైసిపి పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం గలమెత్తి ప్రజలకు చేరువుగా ఉండాలని సూచించారని ఆమె తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో గతంలో వలే ఏజెన్సీ వ్యాప్తంగా ప్రభంజనం సృష్టించే విధంగా అందరూ కష్టించి కృషి చేయాలన్నారు. గిరిజన ప్రాంతం ప్రజలు వైఎస్ఆర్సిపి పై ఎంతో నమ్మకంతో ఉన్నారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సమస్యలపై గల మెత్తాలని తెలియజేశారని మాధవి అన్నారు. అనంతరం ఆమె చిన్న కుమార్తె పుట్టిన తర్వాత మొదటిసారిగా జగన్మోహన్ రెడ్డిని కలవడంతో చిన్నారిని అక్కున చేర్చుకొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మాధవి భర్త నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుసిరెడ్డి శివప్రసాద్ పాల్గొన్నారు

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి...!

కాంగ్రెస్ శ్రేణులకు డీసీసీ ప్రెసిడెంట్ పున్న కైలాష్ నేత, ఎమ్మెల్యే బాలు నాయక్ దిశానిర్దేశం





**ప్రతినిధి కురుపాటి గణేష్ నల్లగొండ జిల్లా జూలై 23 (అఖండ భూమి న్యూస్):** నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం, పిఏపల్లి మండలం ఎర్రగుంట తండాలో నిర్వహించిన సర్ సమీక్ష సమావేశం శుక్రవారం నాడు ఘనంగా జరిగింది.. ఈ సమావేశంలో నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు పున్న కైలాష్ నేత మరియు దేవరకొండ శాసనసభ్యులు నేనవత్ బాలు నాయక్ ముఖ్య అతిథులుగా కలిసి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా బూత్ లెవెల్ కో-ఆర్డినేటర్లు, బిఎల్ఎలు మరియు కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి పార్టీ బలోపేతం, ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియపై సుదీర్ఘంగా సమీక్షించారు..సమావేశంలో డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత మాట్లాడుతూ...రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని తెలిపారు..పార్టీకి క్షేత్రస్థాయిలో అసలైన బలం బూత్ లెవెల్ కో-ఆర్డినేటర్లు మరియు బిఎల్ఎలేనని, ప్రతి కార్యకర్త ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు..ఎమ్మెల్యే నేనవత్ బాలు నాయక్ మాట్లాడుతూ...దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు..కొత్త ఓటర్ల నమోదు, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చడం మరియు తప్పుల తడకలుగా ఉన్న ఓటర్ల వివరాలను సరిదిద్దే బాధ్యతను బిఎల్ఎలు సవాలుగా తీసుకోవాలని సూచించారు..గ్రామ గ్రామాన కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు..ఓటర్ల నమోదు సమగ్రత : అర్హులైన యువతీ యువకులందరినీ కొత్త ఓటర్లుగా నమోదు చేయించాలి..బూత్ పరిధిలో బిఎల్ఎలు, నాయకులు నిరంతరం సమావేశమై ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలి..ప్రభుత్వ పథకాల ప్రచారం : ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి..ఈ కార్యక్రమంలో పిఏపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ లెవెల్ కో-ఆర్డినేటర్లు, బిఎల్ఎలు, ప్రజాప్రతినిధులు, ఎర్రగుంట తండా గ్రామ ముఖ్యులు మరియు కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ ఫాసిస్ట్ పాలన...!

డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అక్రమ అరెస్ట్, గాయపరచడాన్ని తీవ్రంగా నిరసిస్తూ దేవరకొండలో భారీ ఆందోళన

ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్‌తో కలిసి పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు

బస్టాండ్ సెంటర్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం





**ప్రతినిధి కురుపాటి గణేష్ నల్లగొండ జిల్లా జూలై 23 (అఖండ భూమి న్యూస్):** దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాలరాస్తూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఫాసిస్ట్ పాలన సాగిస్తోందని నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు పున్న కైలాష్ నేత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు..లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేసి, భౌతిక దాడులతో గాయపరచడాన్ని నిరసిస్తూ గురువారం నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు..దేవరకొండ పట్టణంలోని స్థానిక బస్టాండ్ ఆవరణ ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ నిరసన కార్యక్రమంలో దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ తో కలిసి డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు..ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, రహిత విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు హోరెత్తించారు..అనంతరం కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి నిరసనగా బస్టాండ్ ప్రధాన కూడలి వద్ద ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు..ఈ సందర్భంగా పున్న కైలాష్ నేత మాట్లాడుతూ...కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా వచ్చిన ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కుట్రలు చేస్తోంది. ప్రజల తరఫున, దేశ సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజా నాయకుడు రాహుల్ గాంధీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే మోదీ ప్రభుత్వం ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతోంది..ప్రతిపక్ష నాయకుడిని అక్రమంగా అరెస్టు చేయడమే కాకుండా గాయపరచడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి, దమనకాండకు పరాకాష్ట.హకేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాజ్యాంగబద్ధమైన సంస్థలను దుర్వినియోగం చేస్తూ, ప్రశ్నించే గొంతులను భయభ్రాంతులకు గురిచేస్తోంది..ఎన్ని కుట్రలు చేసినా, ఎంతటి అణచివేతకు పూనుకున్నా కాంగ్రెస్ పార్టీ భయపడేది లేదు..ప్రజాక్షేత్రంలో మోదీ ఫాసిస్ట్ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయి. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుంది..ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ...దేశంలో ప్రతిపక్షాలు లేకుండా చేయాలనే దుర్బుద్ధితో ప్రధాని మోదీ వ్యవహరిస్తున్నారు..ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కును కూడా కాలరాయడం దారుణం..రాహుల్ గాంధీపై జరిగిన దాడిని, అక్రమ అరెస్టును దేవరకొండ నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయి..మోదీ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు చేపడతాం..ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన, విద్యార్థి విభాగాల నాయకులు మరియు పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు...

# దేశ బలగాలపై విచక్షణారహితంగా దాడులు చేస్తున్న వీళ్లు విద్యార్థులా ,బిజెపి నాయకుడు సుంకర శ్రీరాములు



**ఆలమూరు,జూలై 23(అఖండ భూమి న్యూస్):** దేశ బలగాలపై విచక్షణారహితంగా దాడులు చేస్తున్న వీళ్లు విద్యార్థులా? విద్యార్థుల ముసుగులో ఉన్న దేశ వ్యతిరేక శక్తులతో కలిసి కాంగ్రెస్ వికృత చర్యలు.... బీజేపీ నాయకులు సుంకర శ్రీరాములు....దేశ భద్రత బలగాలపై విచక్షణారహితంగా దాడులు చేస్తున్న వీళ్లు విద్యార్థులా అంటూ బిజెపి నాయకులు సుంకర శ్రీరాములు ప్రశ్నించారు. దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థుల ముసుగులో ఉన్న దేశ వ్యతిరేక శక్తులతో కలిసి కాంగ్రెస్ వికృత చర్యలు చేస్తుందని పేర్కొన్నారు.విద్యార్థుల పరీక్ష పేపర్ లీకులపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. నీట్ పరీక్షలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు నివేదికలు అందిన వెంటనే తక్షణ చర్యలు తీసుకొని, పేపర్ లీకుకు కారణమైన 13 మందిని అరెస్టు చేసి జైల్లో పెట్టారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యమిస్తూ పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తే, విద్యార్థులు రీ-ఎగ్జామ్ రాసి కౌన్సిలింగ్‌కు వెళ్లారని తెలిపారు. ర్యాంకు వచ్చినవారు సీటు కోసం క్యూ కట్టారని పేర్కొన్నారు.ర్యాంకు రానివాళ్లు లాంగ్ టర్మ్ ప్రిపరేషన్‌లో ఉన్నారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకోసం చదువుల్లో నిమగ్నమై ఉంటే, విద్యార్థుల ముసుగు వేసుకొని ధర్నాలలో పాల్గొంటున్న ఈ ముదురుపోయిన విద్యార్థులు ఎవరో కాంగ్రెస్ నాయకులకే ఎరుకని ఎద్దేవా చేశారు. యుపీఏ పాలనలో లీకులకు, స్కాంలకు పుట్టినిల్లయిన కాంగ్రెస్ నాయకులు ఆ చరిత్రను మర్చిపోయి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రధాని మోదీని పిరికివాడని, అమిత్ షాను చేతకానివాడంటూ విమర్శించడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఆలమూరు మండల బిజెపి అధ్యక్షుడు సుంకర శ్రీరాములు పేర్కొన్నారు.

# డాక్టర్ చల్లా ఆధ్వర్యంలో ఎర్ర కాలనీలో సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలకు శ్రీకారం.






**ఆలమూరు,జూలై 23(అఖండ భూమి న్యూస్):** మండల కేంద్రం ఆలమూరు ఎర్ర కాలనీలో వెలసిన సత్తెమ్మ తల్లి అమ్మవారికి ఆషాడమాసంలో గురువారం ప్రత్యేక పూజలు చేయించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు,ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత,సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు.ఈ అమ్మవారి గురించి డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు దృష్టికి తీసుకురాగా ఆయన కమిటీ ఏర్పాటు చేసి ఆయన ఆధ్వర్యంలో శ్రీకృష్ణతేజ రైస్ మిల్ అధినేత వైట్ల కనక దుర్గారావు ఆర్థిక సహాయంతో అమ్మవారి ఆలయ నిర్మాణం, గ్రామస్థుల సహకారంతో ఆర్చ్ నిర్మాణం జరిగినది.ప్రతి శుక్రవారం గద్దె చెప్పడం జరుగుతుంది.డాక్టర్ చల్లా ఆధ్వర్యంలో సత్తెమ్మ తల్లి అమ్మవారికి కొబ్బరికాయ కొట్టి జాతర మహోత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు.ఆషాఢ మాసంలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు.ఈ అమ్మవారికి ఇక్కడ 30 సంవత్సరాల నుండి పూజలు జరుగుతున్నాయని,అమ్మవారు ఎంతో మహిమ గల దేవత అని,కోరిన కోర్కెలు తీర్చే చల్లని దేవత అని డాక్టర్ చల్లా అన్నారు.

వచ్చే నెల ఆగష్టు 7 వ తేదీన శుక్రవారం గ్రామస్థుల సహకారంతో అమ్మవారి జాతర మహోత్సవం జరుగుతాదని,అదే రోజు పసుపు, కుంకుమతో అమ్మవారికి ఆషాడం శారి కావిడ జరుగునని ఆలయ కమిటీ వారు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ చప్పిడి అనిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ రేలంగి సురేష్, సెక్రటరీ తిరణం ధనరాజు, జాయింట్ సెక్రటరీ పైడికొండల బాబి, కోశాధికారి పసుపులేటి రాంబాబు,చల్లా భూషణం,ఎలుగుబంట్ల సాయిబాబు,ఎలుగుబంట్ల బూరయ్య,నార్గని వీరబాబు,నార్గని సెంథిల్ కుమార్,ఎరుకొండ గణేష్,లంకే వెంకటరెడ్డి,కమిటీ సభ్యులు తాడి కిరణ్ కుమార్, కస్తూరి నారాయణమూర్తి, ర్యాలి రమేష్, వాసంశెట్టి లక్ష్మణరావు, మాగాపు సాయికుమార్, కుందూరి పట్టాభిరామారావు మరియు అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వానమ్మ ఒకసారి రావమ్మ వర్షం కోసం రైతులు పూజలు





**కోటనందూరు,జూలై 23 (అఖండ భూమి న్యూస్):** చినుకు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు... వానమ్మ ఒక్కసారి రావమ్మా అంటూ వేడుకుంటున్నారు.. తమ ఇష్టదైవాలకు జలాభిషేకాలు చేస్తూ వానలు కురిపించాలని మొక్కుకుంటున్నారు.. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం కోటనందూరు గ్రామంలో గ్రామస్తులు గురువారం గ్రామదేవతలకు, ఇష్ట దైవాలకు జలాభిషేకం నిర్వహించి వానలు కురిపించాలని కోరారు

# బేబీ కృష్ణకి రూ.30 వేలు ఆర్థిక సాయం.



**ఆలమూరు,జూలై 23(అఖండ భూమి న్యూస్):** వృత్తి రీత్యా విజయనగరం వెళ్లిన మిత్రులు చిన్నారి ఆరోగ్యం విషయం తెలుసుకుని బాధించి.. అంతలోనే వారి మిత్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి.. ఫోన్ పే ద్వారా అప్పటికప్పుడు వచ్చిన సొమ్ము 30,000 వేల రూపాయలను చిన్నారి బేబీ కృష్ణ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు అందించారు. అత్యంత ఖరీదైన వైద్యంకు సరిపడ సొమ్ము కోసం ఎదురు చూస్తున్న ఆ కుటుంబానికి ఎవరికి తోచిన సహాయం వారు చేస్తే బాగుంటుందని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామానికి చెందిన పంపన వీర్రాజు,తూర్పుగోదావరి జిల్లా అనపర్తి సావరం గ్రామానికి చెందిన పితాని రాజేష్ లు కోరుచున్నారు.

అఖండ భూమి

శుక్రవారం 24-07-2026

## పనికిరాని వస్తువులకు నిత్యావసర సరుకులు

స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్రలో భాగంగా తుగ్గలిలో విస్తృత ప్రచారం

పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛరథానికి అందజేయాలని అధికారుల పిలుపు




**తుగ్గలి, జూలై 23 (అఖండ భూమి న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పనికిరాని వస్తువులను సేకరించి వాటి విలువకు సమానంగా నిత్యావసర సరుకులు అందించే పథకంపై గురువారం తుగ్గలి గ్రామంలో అవగాహన ప్రచారం నిర్వహించారు. ఇళ్లలో ఉపయోగం లేని ఇనుము, ప్లాస్టిక్, పాత పుస్తకాలు, అట్టలు, సీసాలు తదితర పొడి చెత్తను ఇంట్లోనే ప్రత్యేక బ్యాగులో భద్రపరచి, స్వచ్ఛరథం గ్రామానికి వచ్చినప్పుడు అందజేస్తే వాటి విలువకు అనుగుణంగా ఇంటికి అవసరమైన చిన్నపాటి నిత్యావసర వస్తువులు అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా మారడమే కాకుండా కుటుంబాలకు స్వల్ప ఆర్థిక ప్రయోజనం కూడా కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఇకపై తడి చెత్తను మాత్రమే చెత్త డబ్బాలో వేసి, ప్రతిరోజూ వీధుల్లో తిరిగే గ్రీన్ అంబాసిడర్ రిక్షా సిబ్బందికి అందించాలని, పొడి చెత్తను మాత్రం ప్రత్యేకంగా నిల్వ చేసి స్వచ్ఛరథానికి ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కే. విశ్వమోహన్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి, పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ మండల ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో వారాహి నవరాత్రులు ముగింపు సందర్భంగా అమ్మవారికి ఒడిబియ్యం మరియు వివిధ దీపాలతో హారతి





**అనంతపురం (ఎబి నెట్వర్క్ ) జూలై 23 (అఖండ భూమి న్యూస్):** అనంతపురం కు చెందిన సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో 54 శుక్రవారంల ఓడి బియ్యం కార్యక్రమంలో భాగంగా ఈరోజు వారాహి నవరాత్రులు ముగింపు సందర్భంగా సోమనాథ్ నగర్ లోని కోదండ రామస్వామి దేవాలయంలో అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు అధిక సంఖ్యలో మహిళా భక్తుల పాల్గొని కుంకుమార్చన అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లలిత సహస్రనామ పారాయణం చేశారు నవరాత్రి ముగింపు సందర్భంగా అమ్మవారికి కుష్మాండ హారతి, నారికేర హారతి ,జల హారతి కందహారతి, సుగంధ దవ్యాల హారతి, ఫలహారతి ,నిమ్మకాయల హారతి వివిధ రకాల హారతులను అందించి అమ్మవారి ఆశీర్వచనం, అనుగ్రహం కొరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు అని సాయి ట్రస్ట్ అధ్యక్షుడు డా విజయ సాయికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ మాతృమూర్తి మరియు ఈ కార్యక్రమం సేవాకర్త (దాత) రుక్మిణి, భువన, జ్యోతి శ్రీదేవి, వాణి ,నాగరాజు దంపతులు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడ మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు-మంద కృష్ణ మాదిగ --ముద్రగడ సమాధి వద్ద మంద కృష్ణ మాదిగ నివాళి

--పేదల పక్షాన పోరాడిన మహానేత ముద్రగడ మంద కృష్ణ

--సామాజిక ఉద్యమాలకు దిక్సూచి ముద్రగడ పద్మనాభం

--తెలుగు నేల కోల్పోయిన ఉద్యమ యోధుడు ముద్రగడ

--ముద్రగడ కుటుంబాన్ని పరామర్శించిన మంద కృష్ణ మాదిగ

--కాపు ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర "ముద్రగడ"ది

--పదవుల కంటే సమాజానికే ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడు






**కిర్లంపూడి, జూలై 23 (అఖండ భూమి న్యూస్):** కాకినాడ జిల్లా కిర్లంపూడిలో మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత దివంగత ముద్రగడ పద్మనాభం సమాధి వద్ద ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు,పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నివాళులర్పించారు.ముద్రగడ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించి,అనంతరం ఆయన కుమారులు ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు,బాలులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ పేద ప్రజల కోసం జీవితాంతం పోరాడిన మహానాయకుడు ముద్రగడ పద్మనాభమని కొనియాడారు.తెలుగు నేలపై సామాజిక ఉద్యమాలకు దిక్సూచిగా నిలిచిన నాయకుల్లో ముద్రగడ ఒకరని,ఆయన మరణం తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు.తెలుగు రాష్ట్రాల్లో సామాజిక ఉద్యమాలకు పర్యాయపదంగా నిలిచిన కొద్దిమంది మహానుభావుల్లో ముద్రగడ పద్మనాభం పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.వంగవీటి మోహనరంగా హత్య అనంతరం కాపు ఉద్యమాన్ని ముందుకు నడిపించిన మహానేత ముద్రగడేనని గుర్తు చేశారు.రాజకీయ పదవులను పక్కనబెట్టి,తాను నమ్ముకున్న సమాజం కోసం జీవితాంతం పోరాడిన అరుదైన నాయకుడు ముద్రగడ పద్మనాభమని కొనియాడారు.తెలుగు నేలపై ఉద్భవించిన ప్రముఖ సామాజిక ఉద్యమకారుల్లో చరిత్ర సృష్టించిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా గుర్తుండిపోతారని మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు.

## నల్లమల అటవీ ప్రాంతంలో నక్కంటి చెంచు గిరిజన నివాసితులకు.చల్లా కిషోర్ వెంకట ప్రేమ్ కుమార్ సాయం అందించారు

నక్కంటి చెంచు గిరిజలకు. చీరలు, బట్టలు చిన్నపిల్లల డ్రస్సులు లుంగీలు షర్టు సుండి పెంట గ్రామ నివాసితులు గోల్డ్ దుకాణదారుడు చెల్లా బ్రదర్ భాస్కర్ సాగర్ క్లాత్ వెంకట శివకుమార్ పంపిణీ కార్యక్రమం





**శ్రీశైలం జూలై 23 (అఖండ భూమి న్యూస్):** పాలుట్ల కేంద్రంగా దట్టమైన నల్లమల్ల అడవుల్లో ఉన్నటువంటి నక్కంటి ఆదివాసి చెంచు గిరిజన 35 కుటుంబాలు, నల్లమల అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు వారికి ఎటువంటి వసతులు లేవు పూరి గుడిసెల్లో ఇప్పటికి నివాసముంటున్నారు విషయాన్ని సుండి పెంట గ్రామస్తులైన గోల్డ్ షాప్ చల్లా కిషోర్, హరికృష్ణ, భాస్కర్. సాగర్ క్లాత్ సుంకు వెంకట శివ కుమార్, సుభాష్ కొమరం భీమ్ ఆదివాసి గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై ఆశీర్వాదం చెంచుల జీవన స్థితిని వారికి వివరించగా సహృదయంతో వీరు టీముగా ఏర్పడి చెంచు గిరిజనులకు 100 చీరలు, 50 చొక్కాలు, బాలికలకు గౌన్లు, బాలురకు 60 ఇచ్చారు అదేవిధంగా 50 లుంగీలు మగవారికి,వారి సొంత ఖర్చులతో వాహనాన్ని ఏర్పాటు చేసుకొని డీఎఫ్ఓ సహకారంతో సున్నిపెంట నుండి దాదాపు 20 కిలోమీటర్లు దూరం వెళ్లి అక్కడ నివసించే చెంచు గిరిజనులకు వీరు పంపిణీ చేశారు. వారితోపాటు శ్రీశైలం ట్రస్ట్ బోర్డు ఆదివాసి గిరిజన మహిళ గుండ్ల గంగమ్మఈ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గుండ్ల గంగమ్మ కి చెంచు గిరిజన మహిళలు శ్రీశైల పుణ్యక్షేత్రం ట్రస్ట్ బోర్డు మెంబర్ గా కేటాయించిన సందర్భంగా గుండ్ల గంగమ్మ ను అభినందించి నా చెంచు గిరిజన మహిళలు ఆమెకు సెలవు కప్పి సన్మానించారు ఈ సహాయ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన. మార్కాపురం డిఎఫ్ఓ కి ధన్యవాదాలు తెలియజేశారు కార్యక్రమంలో చల్లా కిషోర్, భాస్కర్, హరికృష్ణ, సుంకు వెంకట ప్రేమ్ కుమార్ వారి కుమారుడు సుభాష్ నక్కంటి ఇష్టకామేశ్వరి ఈటీడీఏ ప్రెసిడెంట్ చెవుల చిన్నోడు, చెవుల మల్లికార్జున,చెవుల బసవయ్య, వీరయ్య పంపిణీ కార్యక్రమంలో. అనంతరం బట్టలు పంపిణీ చేసిన చల్లా కిషోర్, హరికృష్ణ, భాస్కర్, సుంకు వెంకట ప్రేమ్ కుమార్ కుమారుడు సుభాష్ ఫారెస్ట్ కరిముల్లా.ఫారెస్ట్ గిరిజన మహిళలు దాతలకు,ధన్యవాదాలు తెలిపారు,,

# జీవో నంబర్-3పై నిర్దేష్టమైన ప్రతిపాదనలు లేకుండా చర్చలా?

నూరు శాతం రిజర్వేషన్ పై ప్రత్యామ్నాయం జీవో ఇవ్వండి

రెండేళ్లుగా ఊరిస్తున్న హామీలు - ఆచరణలో శూన్యం.గిరిజన సంఘాలు ప్రభుత్వం ఉచ్చులో పడవద్దు

రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం కొనసాగుతుంది .

గత వైసీపీ ప్రభుత్వం అడుగుల్లోనే నేటి కూటమి ప్రభుత్వం





**కొయ్యూరు (పాడేరు) అల్లూరి జిల్లా జూలై 23 (అఖండ భూమి న్యూస్):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా, జీవో నంబర్-3 పునరుద్ధరణ దిశగా ఒక్క ఖచ్చితమైన అడుగు కూడా ముందుకు పడలేదని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి. అప్పల నరస మండిపడ్డారు. గురువారం పాడేరు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యాలయం లో ఆదివాసీ ప్రజా సంఘాల ఉమ్మడి పాత్రికేయుల సమావేశం లోఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి. అప్పల నరస మాట్లాడుతూ సుప్రీంకోర్టు జీవో-3ను రద్దు చేసిన నేపథ్యంలో, న్యాయపరంగా నిలబడే బలమైన చట్టం తీసుకొస్తామని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పదేపదే ప్రకటనలు చేస్తున్నా, ముసాయిదా బిల్లు గానీ, నిర్దిష్ట కాలపరిమితి గానీ ఇప్పటివరకూ ప్రకటించకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానాలు రేకెత్తిస్తోందని పేర్కొన్నాయని అన్నారు

సమావేశాల పేరుతో కాలయాపనేనా చేస్తూ

9 ఐటీడీఏల పరిధిలో అభిప్రాయ సేకరణ పేరుతో నిర్వహిస్తున్న సమావేశాలు కేవలం కాలయాపన కోసమేనని, వేలాది మంది గిరిజన ఉపాధ్యాయ ఉద్యోగార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని సంఘాలు ఆరోపిస్తున్నాయి. జీవో నెంబర్ 3 ను ప్రభుత్వం పునరుద్ధరణ చేయకపోవడంతో 2025 మెగా డిఎస్సి వల్ల గిరిజన గురుకులం విద్య సంస్థలో ఉన్న ఉద్యోగాలు కోల్పోయి సుమారు 600 మంది గెస్ట్ ప్యాకల్టీ రోడ్డు మీద పడ్డారని తెలిపారు. జీవో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని, "నూటికి నూరు శాతం రిజర్వేషన్ రాజ్యాంగ బదంగా 5 వ షెడ్యూల్డ్ క్లాజ్ 2 ప్రకారం సాధ్యమే. కానీ నేడు నూరు శాతం రిజర్వేషన్ సానుకూలత" అనే మాటలు కేవలం సాంత్వన వాక్యాలుగానే మిగిలిపోతున్నాయని విమర్శించారు. ప్రభుత్వం నియమించిన గిరిజన సంక్షేమ డైరెక్టర్ తో కూడిన కమిటీ సమర్పించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం బహిర్గతం చేయకుండా గిరిజన సంఘాలతో సమావేశం నిర్వహించడం ఆదివాసీలను మోసం చేయడమే అన్నారు

గత వైసీపీ ప్రభుత్వ బాటలోనే నేటి కూటమి ప్రభుత్వం

జీవో-3 రద్దుకు గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మంత్రి చేసిన వ్యాఖ్యలను గిరిజన సంఘాలు ఖండించాయి. అధికారంలో ఉన్న ప్రస్తుత ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పించుకునేందుకు గత ప్రభుత్వంపై నెపం మోపడం సరికాదని, ఇప్పటికే రెండేళ్ల సమయం గడిచినా పరిష్కారం చూపని ప్రస్తుత ప్రభుత్వానిదే అసలైన వైఫల్యమని పేర్కొన్నారు.

1/70 చట్టం పై సుప్రీం కోర్ట్ లో కౌంటర్ ఆపీడవిట్ ఎందుకు దాఖాలు చేయలేదు.

గిరిజన మంత్రి లో స్పష్టత ఏది? 1/70 చట్టంపై పుకార్లు నమ్మవద్దని మంత్రి కోరినప్పటికీ, ఆ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ఎలాంటి కార్యాచరణ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ప్రకటించలేదని గుర్తు చేస్తు 2023లోనే సుప్రీం కోర్ట్ లో దాఖలైన స్పెషల్ లిటీ పిటిషన్ పై నేటి వరకు ఎందుకు కౌంటర్ ఆపీడవిట్ ఫైల్ చేయలేదో ప్రభుత్వం ప్రకటన చేయాలి. మరో పక్క గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్తున్న భూములు, అటవీ హక్కుల చట్టం (ఎఫ్ ఆర్ ఎ) అమలులో జాప్యం వంటి వాస్తవ సమస్యలపై ప్రభుత్వం మౌనం వహిస్తోందని ఆరోపించాయి.

**ప్రతిపక్షాలపై విమర్శలు మాని, పరిష్కారం చూపాలి**

గిరిజన యువతను ప్రలోభపెట్టి ప్రతిపక్షాలు రెచ్చగొడుతున్నాయని మంత్రి చేసిన ఆరోపణలను తోసిపుచ్చాయి. తమ న్యాయమైన హక్కుల కోసం గిరిజనులు స్వచ్ఛందంగా ఉద్యమిస్తున్నారని, దీన్ని రాజకీయ కుట్రగా చిత్రీకరించడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు

గిరిజన గురుకులంలో గెస్ట్ ప్యాకేల్టీ లను వెంటనే విధుల్లో తీసుకోవాలి.

అక్రమ అరెస్ట్ ను ఖండిస్తున్నాం గిరిజన గురుకులంలో విధులు నిర్వహిస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ టీచర్స్ లను తొలగించడం దారుణం. వారిని విధుల్లో తీసుకోవాలని గత 30 రోజుల నుంచి గురుకులం హెడ్ ఆఫీస్ కార్యదర్శి కార్యాలయం లో నిరసన కార్యక్రమం తెలియజేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి చీమకుట్టినట్టు లేకపోవడం అన్యాయం.గిరిజన సంఘాలతో చర్చలు సమావేశం సందర్భంగా అక్కడి చేరుకున్న గురుకులం టీచర్లు గిరిజన మంత్రి కాలు మీద పడే ప్రాధేయపడిన కనీసం స్పందించకపోవడం మంత్రి మానవత్వాన్ని ప్రశ్నిస్తోందని అన్నారు 2025 జూన్లో గిరిజన మంత్రి ఆదివాసి జేఏసీ నాయకులకు హామీ ఇచ్చి ఉద్యమం విర మింప జేశారు.కానీ హామీ అమలు చేయలేదు. నేడు విధుల్లో తీసుకోకుండా రోడ్డు మీద వదిలేయడం చాలా దారుణమైన విషయం గిరిజన మంత్రి గారు ఇచ్చిన హామీని అమలు చేస్తూ, తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని, విజయవాడ మరియు లోకేష్ కార్యాలయంలో నిరసన తెలియజేస్తున్న వారిని అక్రమంగా అరెస్ట్ చేయడాని ఖండిస్తున్నాం. అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ, మహిళా సంఘం నేత విమల, గిరిజన సంఘం నాయకులు దాసు, గుండ్వానా దండగానే పార్టీ నాయకులు రాజు, నిరుద్యోగుల సంఘం నిరుద్యోగుల సంఘం జిల్లా నాయకులు భాను సిహెచ్ రావు కర్జ వై కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ అధ్యక్షులు జీవన్ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కృష్ణ, చిన్నారావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీశైల దేవస్థానం పరిపాలన భవనంలో శ్రావణమాస ఏర్పాట్లపై ప్రాథమిక సమావేశం



**శ్రీశైలం జూలై 23 (అఖండ భూమి న్యూస్):** శ్రీశైలదేవస్థానంలో ఆగస్టు 13న శ్రావణమాసోత్సవాలు ప్రారంభం సెప్టెంబరు 12వ తేదీన ముగియనున్న శ్రావణమాసోత్సవాలు శ్రావణమాసోత్సవాలపై ప్రాథమిక సమావేశాన్ని నిర్వహించిన కార్యనిర్వహణాధికారి రాబోవు ధర్మకర్తల మండలి సమావేశంలో ఉత్సవ నిర్వహణకు సంబంధించి కూలంకష చర్చ శ్రావణశుద్ధ పాడ్యమి, ఆగస్టు 13 నుంచి శ్రావణ మాసోత్సవాలు నిర్వహింపబడనున్నాయి. భాద్రశుద్ధ పాడ్యమి సెప్టెంబరు 12 ఉదయాన ఈ మాసోత్సవాలు ముగుస్తాయి. ఈ మాసోత్సవాల ఏర్పాట్లకు సంబంధించి కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు ప్రాథమిక సమావేశాన్ని నిర్వహించారు. పరిపాలనా కార్యాలయములోని సమావేశమందిరములో నిర్వహించబడిన ఈ సమావేశంలో అర్చకస్వాములు, వేదపండితులు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ శ్రావణమాస ఏర్పాట్లపై రాబోవు ధర్మకర్తల మండలి సమావేశంలో కూలంకషంగా చర్చించి తదనుగుణంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ శ్రావణమాసోత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు పలు ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రాన్ని సందర్శిస్తారన్నారు. ముఖ్యంగా శ్రావణమాసంలో రద్దీ దృష్ట్యా అన్ని విభాగాలు కూడా తగు ముందస్తు ప్రణాళికలతో ఉత్సవ నిర్వహణకు సిద్ధం కావాలని కార్య నిర్వహణ అధికారి యం శ్రీనివాసరావు ఆదేశించారు. భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని విభాగాల వారు కూడా ముందస్తుగా ఆయా ఏర్పాట్లను చేయాలని ఆయనఆదేశించారు అదేవిధంగా శ్రావణమాసములో ముఖ్యంగా శ్రావణ సోమవారాలు, శ్రావణపౌర్ణమి, వరలక్ష్మీవ్రతం, శుద్ధ మరియు బహుళ ఏకాదశి రోజులు, శ్రావణమాసశివరాత్రి మరియు ప్రభుత్వ సెలవురోజులలో అధికసంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించే అవకాశం ఉందన్నారు. ఆయా విభాగాల వారీగా చేపట్టవలసిన చర్యల గురించి కార్యనిర్వహణాధికారి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా భక్తులందరికీ కూడా సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకుగాను అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆలయ మరియు క్యూకాంప్లెక్సు విభాగాన్ని ఆదేశించారు. క్యూలైన్లలో వేచివుండే భక్తుల సౌకర్యార్థం భక్తులందరికీ కూడా ఎప్పటికప్పుడు మంచినీరు, అల్పాహారం మరియు బిస్కెట్లను అందజేయాలని అన్నప్రసాద వితరణ విభాగాన్ని ఆదేశించారు. అదేవిధంగా భక్తుల రద్దీకనుగుణంగా అన్నదానమందిరంలో అన్నప్రసాదవితరణను, సాయంకాలం అల్పాహారాన్ని ఏర్పాటు చేయాలని అన్నదాన విభాగాన్ని ఆదేశించారు. అన్నప్రసాదవితరణలో వండిన వంటకాలన్నీ ప్రతీ భక్తుడికి అందాలన్నారు. అన్నప్రసాదం స్వీకరించే భక్తుడికి కూడా ప్రతీ వంటకం అందాలన్నారు. భక్తులరద్దీకనుగుణంగా అవసరమైన మేరకు లడ్డూప్రసాదాలను తయారు చేసి అందుబాటులో ఉంచాలని ప్రసాదాల విభాగాన్ని ఆదేశించారు. భక్తులు లడ్డూప్రసాదాల కోసం అధికసమయం వేచివుండకుండా త్వరితంగా లడ్డూప్రసాదాలను అందజేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరం మేరకు అదనపు లడ్డు కౌంటర్లను ఏర్పాటు చేయాలని ప్రసాదాల విక్రయ విభాగాన్ని ఆదేశించారు. రద్దీరోజులలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని భద్రతా విభాగాన్ని ఆదేశించారు. ఈ విషయమై స్థానిక పోలీస్ శాఖ వారి సహకారాన్ని పొందాలని సూచించారు భక్తులరద్దీ దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలను తొలగించేందుకు తగు చర్యలు చేపట్టాలని పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు. ఎప్పటి వలనే సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించేందుకు ఆయా ఏర్పాట్లను చేయాలని ఆలయ విభాగాన్ని ఆదేశించారు. అదేవిధంగా ప్రతీ సంవత్సరం వలనే శ్రావణ అఖండ శివనామ భజనలకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. శ్రావణమాసోత్సవాలను పురస్కరించుకుని సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించాలని ఆదేశించారు. మొత్తం మీద భక్తులకు, ముఖ్యంగా సర్వదర్శనం క్యూలైన్లలోని సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అన్ని విభాగాలను ఈవో,యం శ్రీనివాసరావు సూచించారు

# టీనేజ్ గర్భధారణలు,బాల్య వివాహాల నివారణపై సమీక్షలో పాల్గొన్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

--ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం

--సీఎంపివోలు,వీసీపీసి సభ్యుల సమీక్ష సమావేశం

-- శాఖల సమన్వయం,గ్రామ స్థాయి పర్యవేక్షణపై దృష్టి పెట్టాలని సూచన





**ఏలేశ్వరం జూలై 23 (అఖండ భూమి న్యూస్):** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో పట్టణ,గ్రామీణ మండలాల పరిధిలో యుక్తవయస్సు గర్భధారణలు, బాల్య వివాహాల నివారణ, బాలల రక్షణ చట్టాలపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండల స్థాయి సమీక్ష, అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు,మండల స్థాయి బాల్య వివాహాల నిరోధక,పర్యవేక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా యుక్తవయస్సు గర్భధారణలు,బాల్య వివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, శాఖల మధ్య సమన్వయం, గ్రామ స్థాయిలో పర్యవేక్షణ,అనుమానాస్పద బాల్య వివాహాలను వెంటనే గుర్తించి అడ్డుకునే విధానాలు, సంబంధిత చట్టాల అమలు,ప్రజల్లో అవగాహన కల్పించే కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు.అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు.ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం,బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం,గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధ చట్టం,లింగ వివక్ష నిరోధక నిబంధనలు, బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు.ఇతర అధికారులు,ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సహాయవాణి నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె కీర్తి,మండల అభివృద్ధి అధికారి రామరాజు వర్మ,వైద్యులు సౌమ్య,నాగలక్ష్మి,జయరాం,న్యాయవాది అవసరాల దేవి,నాయకులు అలమండ చలమయ్య,బొదిరెడ్డి గోపి, పెంటకోట మోహన్,చిక్కాల లక్ష్మణరావు,పసల సూరిబాబు,కొప్పుల బాబ్జి, మండల విద్యాశాఖ అధికారి అబ్బాయి,నగర పంచాయతీ కమిషనర్,మండల స్థాయి అధికారులు, గ్రామ అభివృద్ధి అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,వైద్య ఆరోగ్య సిబ్బంది, సహాయ నర్సులు,గ్రామ స్థాయి సిబ్బంది,మహిళా సంఘాల ప్రతినిధులు,అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మహనీయుల ఆశయాలే నేటి యువతకు మార్గదర్శకం-డా.ఒమ్మి రఘురామ్

--ఘనంగా బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు

జగ్గంపేట, జూలై 23 (అఖండ భూమి న్యూస్): జగ్గంపేట శ్రీ స్వామి వివేకానంద విద్యా సంస్థల్లో భారత స్వాతంత్ర్య సమరయోధులు,జాతీయ నాయకులు లోకమాన్య బాల గంగాధర్ తిలక్ మరియు అమరవీరుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంస్థల అధినేత డా. ఒమ్మి రఘురామ్ ముఖ్య అతిథిగా పాల్గొని,మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, మహనీయుల ఆశయాలే నేటి యువతకు మార్గదర్శకం అన్నారు.బాల గంగాధర్ తిలక్ స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని నింపిన మహానాయకుడని, "స్వరాజ్యం నా జన్మహక్కు" అనే ఆయన నినాదం కోట్లాది భారతీయులకు స్ఫూర్తినిచ్చిందన్నారు.అలాగే అమరవీరుడు చంద్రశేఖర్ ఆజాద్ అసమాన ధైర్యసాహసాలకు ప్రతీక అని, దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహోన్నత విప్లవకారుడని కొనియాడారు.నేటి విద్యార్థులు ఈ మహనీయుల దేశభక్తి, క్రమశిక్షణ, త్యాగనిరతి, ధైర్యం మరియు విలువలను ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించగా, అధ్యాపకులు మహనీయుల జీవిత విశేషాలను వివరించారు. వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహనీయులకు ఘనంగా నివాళులర్పించారు.

# వైసీపీకి కొమ్ముకాస్తున్న ఎంపీడీవో, ఏపీవో

నిరసన దీక్ష చేపట్టిన అక్క చెల్లెలు ఆవేదన

అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలి

"కాకూరి లోవ దేవి", "కాకూరి సుధారాణి"



**కొయ్యూరు అల్లూరి జిల్లా జూలై 23 (అఖండ భూమి న్యూస్):** వైఎస్ఆర్సిపి నాయకులతో మండల అభివృద్ధి అధికారి ఏ పీ ఓ కుమ్మక్కై తమకు తీవ్ర అన్యాయం చేశారని కాకూరి లోవదేవీ కాకూరి సుధారాణి ఆవేదన వ్యక్తం చేశారు. కొయ్యూరు మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయం ముందు వారం రోజులుగా నిరసన దీక్షలు చేపట్టిన చీడిపాలెం పంచాయితీ వి ఆర్ పి విధుల నుంచి తొలగించిన అక్క చెల్లెల్లు సుధారాణి, లోవదేవీ మాట్లాడుతూ ఏపీవో అప్పలరాజు,ఎంపీడీవో జీడివి ప్రసాద్ లు వైసీపీ ప్రభుత్వంలో వాలంటీర్ గా పనిచేసిన యువకుడిని సెకండ్ వాలంటీర్ గా నియమించి వారికి జీతాలు ఇవ్వాలంటే గర్భాశయ సమస్యలతో పది రోజులు ఆసుపత్రిలోనే చికిత్స నిమిత్తం ఉంటూ మేన్డేట్ చేరలేదంటూ సుధారాణిని విధుల నుంచి తొలగించి నట్లు ఆరోపించారు ఎంపీడీవో కార్యాలయం ముందు మా ఆవేదన నిరసన శాంతియుత రూపంలో మాకు ఉన్న రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుగా శాంతియుత, మార్గంలో నిరసన తెలుపుతున్నప్పటికీ కార్యాలయం ముందు నిరసన దీక్షను తొలగించాలంటూ ఎంపీడీవో, ఏపీవోలు పోలీసులకి ఫిర్యాదు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. తెలుగుదేశం నాయకులు దీక్షను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం వి వి ప్రసాద్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కాకూరు చంద్రరావు, బకీర్ ఖాన్ మాజీ జెడ్పిటిసి గాడి శ్రీరామ్ మూర్తి, దుచ్చరి చిట్టిబాబు, లోత భీమరాజు, శ్యామల వరలక్ష్మి, వై. వరహాలబాబు, బాచి, కొర్రు పుల్లయ్య, పి సన్యాసిరావు, కమ మండల ఆదివాసి జేఏసీ సభ్యులు, అందరూ నిరసన దీక్షకు మద్దతు తెలిపి ఎన్ఆర్ఈజీఎస్ తప్పులను ఎత్తిచూపినప్పటికీ ఉద్దేశపూర్వకంగా గత వైసిపి ప్రభుత్వంలో వాలంటరీగా పని చేసిన వ్యక్తిని రెండవ విఆర్పి గా నియమించిన తనకు జీతాలు ఇవ్వాలంటే నన్ను తొలగించాలన్న ఉద్దేశంతో కొమ్ము కాస్తూ టిడిపి కార్యకర్తలైన అక్కాచెల్లెలను మానవతా దృక్పథం లేకుండా ఉద్దేశపూర్వకంగానే ఇబ్బంది పెడుతున్నట్లు నిరసన దీక్షలో పాల్గొన్న గ్రామస్తులందరూ ముక్తకంఠంతో తెలియజేస్తున్నారు. పార్టీలకు కొమ్ముకాస్తున్న ఇలాంటి అధికారులపై ప్రభుత్వం తక్షణమే శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని పలువురు గిరిజనులు, ఛీడిపాలెం పంచాయితీ గ్రామస్తులు టిడిపి కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు

## ఆదివాసిచెంచు గిరిజనుల సంక్షేమానికి సిబ్బంది కృషి చేయాలి ఐటీడీఏ పిఓ



**శ్రీశైలం జూలై 23 (అఖండ భూమి న్యూస్):** శ్రీశైలం,ఐ టి డి ఎ పరిధి లోని నంద్యాల, మార్కాపురం మరియు పల్నాడు జిల్లా విబి, జి రామ్ జి చెంచుక్షేత్ర స్థాయి సిబ్బందితో ప్రాజెక్ట్ అధికారి పి పి .వి.ఎస్.నాయుడు ఆధర్వంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మూడు జిల్లాలలోని గూడెంలలో జరుగుతున్న ఉపాధి పనుల కల్పన,వేతన చెల్లింపులు,పనిదినాలు కల్పించిన లక్ష్యాలు వివిధ సిబ్బంది వారీగా సమీక్షించారు.పనుల కల్పనలో వెనుకబడిన సిబ్బందిని కఠినంగా హెచ్చరిస్తూ తగు సూచనలు చేశారు. వి బి జి రామ్ జి పథకం ద్వారా అందరూ చెంచు గిరిజన కుటుంబాలకు పూర్తి స్థాయిలో లబ్ది చేకూరేలా కావలిసిన పనులను గుర్తించాలని ఆదేశాలు జారీ చేసారు.అలాగే పియం జన్మన్ క్రింద చేపడుచున్న గృహ నిర్మాణాల కుటుంబాలకు 90 పనిదినాలు కల్పించటం,చెంచు రైతులకు పండ్ల తోటలు వేయించి వారికి సుస్థిర ఆస్తుల కల్పన మరియు అనంత్ అరణ్య నెట్ జీరో హెల్తీ క్యాంపస్ ప్రాజెక్ట్ ద్వారా గిరిజన ఆశ్రమ మరియు గురుకుల పాఠశాల, కళాశాలల్లో జరుగుతున్న పనులపై సమగ్రంగా సమీక్షించడం జరిగినది.విధులపట్ల నిర్లక్ష ధోరణి వదిలి తమకు ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలని ఆదిమజాతి చెంచు గిరిజనుల సంక్షేమం కొరకు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రాజెక్ట్ మేనేజర్ కె.జి.నాయక్, మూడు జిల్లాల ప్రత్యేక అధికారులు మరియు నంద్యాల మార్కాపురం మరియు పల్నాడు జిల్లాల వి బిజి రామ్ సిబ్బంది హాజరు అయ్యారు.

## ఘనంగా నిర్వహించిన బిఎంఎస్ భారతీయ మద్దూర్ సాంగ్ స్థాపించిన రోజు వేడుకలు



**గోకవరం జూలై 23 (అఖండ భూమి న్యూస్):** గోకవరం మండలం లో ఉన్న వీరలంక పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న హిందుస్థాన్ ఎల్పిజి కంపెనీలో పని చేస్తున్నా వర్కర్లు అందరూ ఎల్పిజీ గ్యాస్ కంపెనీ లో తమ పని తాము సక్రమంగా చేస్తున్నాం అని చెప్పారు ఈ రోజు యూనియన్ స్థాపించినటువంటి రోజు సందర్భంగా యూనియన్ సభ్యులు ఘనంగా నిర్వహించుకున్నారు. అలగే యూనియన్ చేసేటటువంటి కార్యక్రమాల్ని యూనియన్ విధానాల గురించి మాట్లాడారు ఈ కార్యక్రమంలో భాగంగా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ కట్ట శ్రీరామ్ జనరల్ సెక్రటరీ పైలీ నాని తెలిపారు

## కనీస వేతనాలు 26 వేల అమలుకు జూలై 30 31న కలెక్టర్ ఆఫీస్ ఆందోళనకు సిద్ధం కావాలి. సిఐటియు పిలుపు



**శ్రీశైలం జూలై 23 (అఖండ భూమి న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులు 102 104 108 పనిచేస్తున్న ఉద్యోగులు మున్సిపల్ కార్మికులు గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికులు 77 షెడ్యూల్డ్ ఎంప్లాయ్మెంట్ కార్మికులు గత పది సంవత్సరాలుగా వేతనాలు పెరగక అతి తక్కువ వేతనాలతో జీవిస్తున్నారు వీరందరికీ కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి ఏసురత్నం శ్రీశైలం సిఐటియు కార్యదర్శి చిన్న మారెన్న తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఫీ సిఐటియు మండల అధ్యక్షులు డి నాగరాజు సిఐటియు నాయకులు మల్లికార్జున కలసి చలో కలెక్టరేట్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకు ధరలు పెరుగుతున్న అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మికుల ఉద్యోగుల వేతనాలు పెరగడం లేదు . ప్రభుత్వ దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లిన ఏమాత్రం కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం లేదు అంగన్వాడి ఆశ మధ్యాహ్నం భోజనం ఫీల్డ్ అసిస్టెంట్లు ఎన్.హెచ్.ఎం స్కీం లో పనిచేసే ఉద్యోగులు ధార్మిక సంస్థల్లో పని చేసే ఉద్యోగులు ఆప్కాస్ ఉద్యోగులు ప్రభుత్వ రంగాలలో పనిచేసే ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా వేతనాలు పెరగక చాలా ఇబ్బందులు పడుతున్నారు వీరందరికీ కనీస వేతనం 26000 ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలి ఈఎస్ఐ పిఎఫ్ అమలు చేయాలి వీరందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోట్లను కొడ్లను వచ్చింది వెంటనే లేబర్ కోడ్లను రద్దు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్సి ఐఆర్ వెంటనే ప్రకటించాలి. పెండింగ్ లో ఉన్న డీఏ ని ఇవ్వాలి పై సమస్యల సాధన కోసం జూలై 30 31వ తేదీన కలెక్టర్ ఆఫీసులో వద్ద జరుగు ఆందోళనకు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు యోబు రాము రంగస్వామి హనుమంత రెడ్డి మల్లయ్య గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గోకవరం ఎస్సై పవన్ కుమార్




**గోకవరం జూలై 23 (అఖండ భూమి న్యూస్):** తల్లికి వందనం సంబంధించి డబ్బులు పడుతున్నాయి కావున. సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని గోకవరం నా× పవన్ కుమార్ సూచించారు. అపరిచితుల కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, బ్యాంక్ వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీలను ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించారు. ఓటీపీ పంచుకుంటే ఖాతాలోని సొమ్ము క్షణాల్లో మోసగాళ్ల పాలవుతుందని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైతే బాధితులు వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

# శ్రీ శైలానికి నల్లమలఅడవిలోగలపాలంకకుగల సంబంధాలు చరిత్ర







**శ్రీశైలం జూలై 23 (అఖండ భూమి న్యూస్):** శ్రీశైలం సమీపంలోని కృష్ణ నది ఒడ్డున పాలంక వీరభద్రస్వామి ఆలయం నుంచి కృష్ణ నదికి దిగే పాత యాత్రా దారి గురించైతే, స్థానిక సంప్రదాయం ప్రకారం చెంచు గిరిజనులు, సన్యాసులు, శ్రీశైలం యాత్రికులు కృష్ణ నదిలో పుణ్యస్నానం చేసి ఆ మార్గం గుండా పాలంక రావడం, వీరభద్ర స్వామిని దర్శించడం, తర్వాత శ్రీశైలం చేరడం అనే సంప్రదాయం ఉండేదని చెబుతారు. కానీ ఈ దారిని ఎవరు నిర్మించారో తెలిపే శాసనం లేదా చారిత్రక ఆధారం ఇప్పుడు లేదు. అందుబాటులో ఉన్న చరిత్ర ప్రకారం శ్రీశైలం ప్రాంతంలో యాత్రా మార్గాల అభివృద్ధికి రెడ్డి రాజులు కృషి చేశారన్న ఆధారాలు ఉన్నాయి, కానీ పాలంక,కృష్ణ నది మార్గాన్ని వారు నిర్మించారన్న నిర్దిష్ట ఆధారం లేదు.? కాబట్టి ఇది తరతరాలుగా ఉపయోగించబడిన పాత యాత్రా దారిగా భావించటం సరైనది.? ఆ మార్గం గురించి స్థానికంగా చెప్పబడే కథనాలు కూడా తప్పకుండా. పాలంక వీరభద్రస్వామి ఆలయం నల్లమల అడవి ప్రాంతంలో, పాలుట్లకి సమీపంలో ఉన్న పురాతన శైవ క్షేత్రం. స్థానిక కథనం ప్రకారం దక్షయజ్ఞం ధ్వంసం తర్వాత వీరభద్రుడు తన ఉగ్రరూపం శాంతింప చేయించుకునేందుకు నల్లమల అడవుల్లో తపస్సు చేశాడని చెబుతారు?. మరో కథనం ప్రకారం అక్కడ నివసించిన చెంచు గిరిజనులు అడవిలో స్వయంభూ శిలారూపాన్ని దర్శించి దాన్ని వీరభద్రస్వామిగా పూజించడం ప్రారంభించారని చెబుతారు.? ఈ ఆలయానికి ఏ రాజు శాసనపూర్వకంగా నిర్మించాడో తెలిపే ప్రత్యక్ష ఆధారం ప్రస్తుతం లేదు,?కానీ కాకతీయులు, రెడ్డి రాజులు, విజయనగర పాలకుల కాలంలో ఈ ప్రాంతంలోని శైవ క్షేత్రాలకు పునర్నిర్మాణం, విస్తరణ జరిగినట్లు చరిత్రకారులు భావిస్తారు?. కానీ దీనిని నిర్ధారించే ప్రత్యక్ష ఆధారం మాత్రం లేదు. ఈ ఆలయం వీరత్వం, రక్షణ, ధైర్యానికి ప్రతీకగా భక్తులు ఇప్పటికీ పూజిస్తారు. మహాశివరాత్రి, కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతాయి. పాలుట్ల నుంచి కృష్ణ నది వరకు దారి ఉందని స్థానికులు చెబుతారు,?అది యాత్రికులు, చెంచు గిరిజనులు వాడిన అడవి మార్గం గా భావిస్తారు.?కానీ ఈ దారిని ఎవరు నిర్మించారు, ఏ కాలంలో అధికారికంగా నిర్మించారన్న స్పష్టమైన శాసన ఆధారం లేదనిపిస్తుంది. చరిత్రలో శ్రీశైలం యాత్రికుల సౌకర్యం కోసం రెడ్డి రాజుల కాలంలో మెట్లు, ఘాట్లు, కాలిబాటలు నిర్మించారన్న వివరాలు ఉన్నాయి. కానీ పాలంక నుంచి కృష్ణా నదికి దిగే ప్రత్యేక దారి ఎవరు నిర్మించారో స్పష్టంగా చెప్పే ఆధారాలు లేవు?. కాబట్టి దాన్ని ఒక నిర్దిష్ట రాజుకు ఆపాదించడం సరైంది కాదు. పాలంక అంటే పాలుట్ల సమీపంలోని పాలంక వీరభద్రస్వామి ఆలయం నుంచి కృష్ణా నదికి వెళ్లే దారి పాలంక ప్రాంతం సంబంధించిన చరిత్రను మరింత ఖచ్చితంగా స్థానికంగా చెప్పుకునే కథనాల ప్రకారం, పాలుట్ల నుంచి కృష్ణ నదికి వెళ్లే దారిని కొందరు ఋషుల బాట" అని కూడా అంటారని చెబుతారు. పూర్వకాలంలో ఋషులు, యోగులు, చెంచు గిరిజనులు ఆ అడవి దారిగా కృష్ణ నదికి వెళ్లి స్నానం చేసి, తర్వాత వీరభద్ర స్వామిని దర్శించి శ్రీశైలం చేరేవారని చెబుతారు.?ఇంకొక కథనం ప్రకారం దక్షయజ్ఞం అనంతరం వీరభద్రుడు ఈ ప్రాంతంలో సంచరించి తపస్సు చేశారని, ఆయన పాదస్పర్శతో ఈ ప్రాంతం పావనమైందని భక్తులు నమ్ముతారు. అందుకే ముందుగా వీరభద్రస్వామిని దర్శించి, ఆపై శ్రీ మల్లికార్జున స్వామిని దర్శిస్తే యాత్ర సంపూర్ణం అవుతుందని నమ్మకం. చెంచు గిరిజనుల సంప్రదాయంలోనూ ఈ మార్గానికి ప్రత్యేక స్థానం ఉంది. వారు నల్లమల అడవిని చెంచు మల్లన్న స్థలంగా భావించి అడవిలోని ప్రతి కొండ, ప్రతి నీటి ఊట, ప్రతి దారి పవిత్రమే అని తమ మౌఖిక సంప్రదాయాల్లో చెబుతారు. ఇవన్నీ స్థానిక విశ్వాసాలు మాత్రమే, అన్నింటికీ స్వతంత్ర చారిత్రక ఆధారాలు ఉన్నాయని చెప్పలేం.పాలుట్ల గ్రామానికి విజయనగర రాజులతో ఉన్న అనుబంధం లేదా శ్రీ మల్లికార్జున స్వామికి దానం చేసిన శాసనం గురించి తప్పకుండా. ఇప్పుడు అన్నీ కలిపితే, పాలుట్ల గ్రామం నల్లమల అడవుల్లో చాల కాలంగా శ్రీశైలం యాత్రా సంప్రదాయంతో అనుబంధం కలిగి ఉంది. విజయనగర కాలానికి చెందిన ఒక తెలుగు శాసనంలో పాలుట్ల గ్రామాన్ని శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయానికి సర్వమాన్యంగా దానం చేసినట్లు ప్రస్తావన ఉంది. పాలుట్ల సమీపంలోని పాలంక వీరభద్రస్వామి ఆలయం స్థానికంగా ఎంతో పవిత్ర క్షేత్రంగా భావించబడుతుంది. పురాణ సంప్రదాయం ప్రకారం దక్షయజ్ఞం అనంతరం వీరభద్రుడు నల్లమల ప్రాంతంలో సంచరించి తపస్సు చేశాడని భక్తుల నమ్మకం. ఈ ఆలయాన్ని ఎవరు నిర్మించారో నిర్దిష్ట శాసనం లభించలేదు. పాలంక నుంచి కృష్ణ నదికి వెళ్లే పాత అడవి దారి గురించి చెంచు గిరిజనులు మరియు యాత్రికులు వాడినట్లు కథనాలు చెబుతాయి, కానీ ఏ రాజు ఆ దారిని నిర్మించారో ఆధారాలు లేవు. స్థానిక సంప్రదాయాల్లో వీరభద్రస్వామి తపస్సు, యాత్ర, చెంచు గిరిజనుల భక్తి కథలు బలంగా ఉన్నప్పటికీ, ఇవన్నీ ఎక్కువగా మౌఖిక సంప్రదాయం ఆధారితమైనవి, నిర్ధారిత చారిత్రక శాసనాలు కావు. చరిత్రపరంగా చెప్పగలిగేదేమిటంటే పాలుట్లకు శ్రీశైలం దేవస్థానంతో శాసన ఆధారిత అనుబంధం ఉంది, అదే సమయంలో పాలంక ఆలయం మరియు కృష్ణ నదికి వెళ్లే పాత దారి ప్రధానంగా స్థానిక భక్తి సంప్రదాయాల్లో భాగం. ఇవన్నీ కలిపితే ఈ ప్రాంతం శ్రీశైలం మహాక్షేత్రంతో ముడిపడి ఉన్న పవిత్ర మార్గంగా లోతైన ఆధ్యాత్మిక విలువతో భావించబడుతోంది. పాలుట్ల గ్రామానికి విజయనగర రాజులతో ఉన్న చారిత్రిక అనుబంధం లేదా శాసన వివరాలు కూడా కలిపి "ఆలాటం . కోట అయితే, నల్లమల అడవిలోని పాలుట్ల పాలంక లోయ నుంచి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఈ కోట అవశేషాలు ఉన్నాయని స్థానికులు చెబుతారు. కొన్ని చారిత్రక కథనాల ప్రకారం విజయనగర రాజు శ్రీకృష్ణదేవరాయలు గజపతులపై విజయం సాధించిన తర్వాత శ్రీశైలం వచ్చినప్పుడు, తన సేనాధిపతులు బోడ వెంకటపతి నాయుడు మరియు నలగాటి పెద్ద తిమ్మానాయుడుకు ఈ ప్రాంతాన్ని జాగీరుగా ఇచ్చి, కృష్ణా నది ఒడ్డున ఈ ఆలాటం కోటను నిర్మింపజేశారని చెబుతారు. అయితే దీనిని నిర్ధారించే శాసన ఆధారాలు పరిమితంగానే ఉన్నాయి, బోయ కోటగా కూడా పిలిచే సంప్రదాయం ఉంది, తూర్పు చాళుక్యులు మరియు విజయనగర కాలంలో బోయ కోటలు ఉన్నట్టు స్థానిక సంప్రదాయాలు చెబుతున్నాయి. మీకు ఆసక్తి ఉంటే ఆలాటం కోటకు సంబంధించిన పూర్తి చరిత్ర, అక్కడి శిలాశేషాలు, పాత యాత్రా మార్గం, పాలుట్ల-శ్రీశైలం అనుబంధం కోట నల్లమల అడవిలో పాలుట్ల ప్రాంతం నుంచి కృష్ణానది వైపు ఉన్న ప్రాచీన రక్షణ స్థలంగా స్థానికులు గుర్తిస్తున్నారు. అక్కడ కోట గోడల అవశేషాలు, రాతి నిర్మాణాల ఆనవాళ్లు కనిపిస్తాయని అక్కడికి వెళ్లిన వారు పేర్కొన్నారు. స్థానిక కథనం ప్రకారం శ్రీకృష్ణదేవరాయలు యాత్రికులను దోపిడీదారుల నుంచి రక్షించడానికి తన సేనాధిపతులు బోడ వెంకటపతి నాయుడు, నలగాటి పెద్ద తిమ్మానాయుడు లకు ఈ ప్రాంతాన్ని అప్పగించి కోట నిర్మింపజేశారని చెబుతారు, కానీ దీనిని నిర్ధారించే శాసన ఆధారాలు స్పష్టంగా లేవు, అందుకే ఇది స్థానిక చారిత్రక సంప్రదాయంగా భావిస్తారు. దీనిని బోయకోటగా కూడా పిలుస్తారు, బోయ నాయకులు నల్లమల అటవీ మార్గాలపై పర్యవేక్షణ ఉండటం వల్ల ఈ పేరు వచ్చిందని భావిస్తారు. ఆలాటం కోట ప్రాముఖ్యత కేవలం సైనిక పరంగానే కాక పాలంక వీరభద్రస్వామి ఆలయం, పాలుట్ల గ్రామం, కృష్ణానది యాత్రా మార్గం, శ్రీశైలం యాత్ర అన్నింటినీ కలిపే కేంద్రంగా స్థానిక సంప్రదాయాల్లో ప్రస్తావిస్తారు, చుట్టుపక్కల వీరగల్లులు, పాత ఆలయ అవశేషాలు, శాసనాలు ఉన్నట్టు కూడా కొందరు పరిశోధకులు చెబుతున్నారు. అయితే వీటిపై సమగ్ర పురావస్తు తవ్వకాలు ఇంకా జరగలేదు. కాబట్టి, ఆలాటం కోట చరిత్రలో కొన్ని అంశాలు నిర్ధారణ కాకపోయినా, శ్రీశైలం యాత్రా మార్గ చరిత్రలో ఒక ముఖ్య స్థానంగా భావిస్తారు.

## ఐఐటీలో సీటు సాధించిన పూర్వ విద్యార్థి సురేంద్రకు అభినందనలు-అధినేత సుంకర వీరబాబు

ఒమ్మంగి శ్రీ భారతి విద్యానికేతన్ పూర్వ విద్యార్థి ఘనత



**ప్రత్తిపాడు, జూలై 23 (అఖండ భూమి న్యూస్):** ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలోని శ్రీ భారతి విద్యానికేతన్ పూర్వ విద్యార్థి దేవరపు సురేంద్ర చెన్నైలోని ప్రతిష్టాత్మక ప్రభుత్వ ఐఐటీ కళాశాలలో సీటు సాధించిన సందర్భంగా శ్రీ భారతి విద్యాసంస్థల అధినేత,కరస్పాండెంట్ సుంకర వీరబాబు అభినందనలు తెలిపారు.విద్యార్థి సురేంద్ర కృషి,పట్టుదలతో ఉన్నత లక్ష్యాన్ని సాధించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు.భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.శ్రీ భారతి విద్యానికేతన్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని కరస్పాండెంట్ సుంకర వీరబాబు పేర్కొన్నారు.

## బార్లపూడి క్రాంతిని పరామర్శించిన డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

--ముద్రగడ సేవలు చిరస్మరణీయం

-- రాజమండ్రిలో ముద్రగడ చిత్రపటానికి నివాళులు..





**రాజమహేంద్రవరం జూలై 23 (అఖండ భూమి న్యూస్):** మాజీ మంత్రి,కాపు ఉద్యమనేత కీర్తిశేషులు ముద్రగడ పద్మనాభం మృతి పట్ల కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు,డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలోని ముద్రగడ పద్మనాభం కుమార్తె బార్లపూడి క్రాంతి నివాసానికి వెళ్లిన తుమ్మల రామస్వామి (బాబు) ఆమెను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.అనంతరం ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కాపు వర్గ హక్కుల సాధనతో పాటు సమాజ అభ్యున్నతికి ముద్రగడ చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 40 రోజులుగా గోకవరంలో తీవ్ర తాగునీటి కష్టాలు.




**గోకవరం జూలై 23 (అఖండ భూమి న్యూస్):** గోకవరం పంచాయతీ పరిధిలో 'శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ పథకం' ద్వారా గత 40 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏడు నెలలుగా జీతభత్యాలు చెల్లించకపోవడంతో గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెకు దిగడమే దీనికి కారణం. వెంటనే జీతాలు చెల్లించి తాగునీటి సమస్యను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

## తల్లికి వందనం.. విద్యార్థుల చదువుకు ప్రభుత్వ భరోసా

అర్హులైన ప్రతి విద్యార్థికి రూ.15 వేల ఆర్థిక సాయం

రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి



**తుగ్గలి, జూలై 23 (అఖండ భూమి న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం ద్వారా అర్హులైన ప్రతి విద్యార్థికి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేస్తోందని రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి తెలిపారు. తుగ్గలి మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ పథకం కింద ప్రతి అర్హ విద్యార్థికి రూ.13 వేలును తల్లి బ్యాంకు ఖాతాలో జమ చేయడంతో పాటు, రూ.2 వేలును పాఠశాల నిర్వహణ కోసం కేటాయిస్తున్నట్లు వివరించారు. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పత్తికొండ ఎమ్మెల్యే కే ఈ శ్యాంబాబు గార్ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని వెంకటపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు రాజేంద్ర గౌడ్, కోటేష్ గౌడ్, మాభాష, రామయ్య, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## క్రాప్ ఇన్సూరెన్స్ నమోదుకు నేడు ఆఖరు తేదీ

రైతులు ఆఖరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే బీమా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి...

మండల వ్యవసాయ అధికారి జి.సత్యనారాయణ...



**వత్సవాయి, జూలై 23 (అఖండ భూమి న్యూస్):** మండల పరిధిలోని రైతులందరూ ప్రభుత్వం అందిస్తున్న పంట బీమా (క్రాప్ ఇన్సూరెన్స్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వత్సవాయి మండల వ్యవసాయ అధికారి జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు.వ్యవసాయ శాఖ నిబంధనల ప్రకారం ఖరీఫ్ సీజన్కు సంబంధించి పత్తి పంటలకు బీమా నమోదు చేసుకునేందుకు నేడు (జులై 24) చివరి తేదీగా ఖరారు చేసినట్లు ఆయన మీడియా ద్వారా వెల్లడించారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఖరీఫ్ సీజన్లో రైతులు సాగు చేసిన ప్రధాన పంటలకు ఇన్సూరెన్స్ నమోదు చేసుకోవడానికి ఈ రోజే పత్తి పంటకు మాత్రమే అవకాశం ఉందని స్పష్టం చేశారు.?ఆర్థిక ధీమా కోసమే పంట బీమా ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, పురుగులు లేదా తెగుళ్ల వల్ల పంట నష్టం వాటిల్లితే రైతులు ఆర్థికంగా కుదేలు కాకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పంట బీమా అవకాశాన్ని కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు.కావున పత్తి పంటలను సాగు చేసిన రైతులందరూ నిర్దేశిత గడువు ముగిసేలోపే తమకు సమీపంలో ఉన్న మీ-సేవ (మీసేవ) కేంద్రాల్లో గానీ, కామన్ సర్వీస్ సెంటర్ల (సిఎస్సి) లో గానీ లేదా రైతు సేవా కేంద్రాలలో తమ వివరాలను సమర్పించి నమోదు చేసుకోవాలని సూచించారు.?సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందే పూర్తి చేయాలి చివరి రోజున అందరూ ఒక్కసారిగా లాగిన్ అవ్వడం వల్ల సర్వర్ డౌన్ అవ్వడం లేదా ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఏవో తెలిపారు.అందువల్ల రైతులు ఆఖరి నిమిషం వరకు వేచి చూడకుండా, వెంటనే తమ వద్ద ఉన్న ఆధారాలతో ఇన్సూరెన్స్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి. సత్యనారాయణ కోరారు.

## ఈ నెల ఆఖరిలోగా పంటల బీమా చెల్లించాలి:

దేవనకొండ మండల వ్యవసాయ శాఖ అధికారి ఉషారాణి

**దేవనకొండ జూలై 23 (అఖండ భూమి న్యూస్):** మండలంలోని రైతులకు దేవనకొండ వ్యవసాయ శాఖ ముఖ్యమైన విజ్ఞప్తి చేసింది. సాగు చేసిన పంటలకు మాత్రమే రైతులు ఈ నెల ఆఖరి తేదీలోగా బ్యాంకులు లేదా మీసేవ కేంద్రాల ద్వారా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని కోరింది.

**ముఖ్య నిబంధనలు:** సాగు చేయని పంటకు బీమా చెల్లిస్తే అది వర్తించదు. బ్యాంక్ రుణం పొందిన పంట కాకుండా వేరే పంట వేస్తే, బ్యాంక్లో 'ఆప్ట్-ఔట్' ఫారం ఇచ్చి, ఆపై మీసేవలో నిజంగా సాగు చేసిన పంటకే బీమా చెల్లించాలి. మీసేవ రసీదు ప్రతిని రుణం పొందిన బ్యాంక్లో తప్పనిసరిగా సమర్పించాలి. రైతులు తమ పంట వివరాలను స్థానిక రైతు సేవా కేంద్రం ఆర్ ఎస్ కె సిబ్బంది వద్ద ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి.

# నేటి విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి




**చిలకలూరిపేట జూలై 23 (అఖండ భూమి న్యూస్):** విద్యార్థుల భవిష్యత్తు కోసం, న్యాయమైన విద్యా వ్యవస్థ కోసం శుక్రవారం విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయాలని ఏఐఎస్ ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు కోరారు. గురువారం సీపీఐ కార్యాలయలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజ్ ఘటన లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేసిందన్నారు. సంవత్సరాల పాటు కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్య అని, పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగాల్సిన జాతీయ స్థాయి పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడం వల్ల విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో విశ్వాసం దెబ్బతిందన్నారు. ఇలాంటి తీవ్రమైన వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ సంబంధిత కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రశ్నాపత్రం లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, పూర్తి స్థాయి నిష్పాక్షిక విచారణ నిర్వహించి బాధ్యులందరినీ చట్టపరంగా శిక్షించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలనే లక్ష్యంతో ఈ నెల 24వ తేదీన ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నామని అన్నారు. బంద్ ఏ ఒక్క సంఘానిదో కాదు దేశ విద్యా వ్యవస్థలో పారదర్శకత, న్యాయం, జవాబుదారీతనం కోసం జరుగుతున్న ప్రజాస్వామ్య నిరసన అని అన్నారు. విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, అధ్యాపకులు ఈ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేసి విజయవంతం చేయాలని కోరారు. విద్యను వ్యాపారంగా కాకుండా హక్కుగా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. విద్యార్థుల శ్రమకు విలువ దక్కేలా, పరీక్షలపై నమ్మకం నిలిచేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. శుక్రవారం జ జరిగే విద్యాసంస్థల బంద్‌లో ప్రతి విద్యార్థి చైతన్యంతో పాల్గొని, ప్రశాంతంగా, క్రమశిక్షణతో బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ ఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి కే మల్లికార్జున్, బొంత పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి -- - ఢిల్లీలో విద్యార్థులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం!

జేఏసీ అఖిలపక్షాల ఆధ్వర్యంలో రేపు విద్యాసంస్థల బంద్ ‍ఊ భారీ నిరసన ర్యాలీ




**యర్రగొండపాలెం జూలై 23 (అఖండ భూమి న్యూస్):** దేశవ్యాప్తంగా లక్షలాది మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తూ జరిగిన.నీట్ పరీక్ష పేపర్ లీకేజీ మరియు అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని జేఏసీ (జాయింట్ యాక్షన్ కమిటీ) మరియు అఖిలపక్ష నాయకులు తీవ్రంగా నిరసిస్తున్నారు. తన భవిష్యత్తు కోసం, న్యాయమైన హక్కుల కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువత, విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వ ఆజ్ఞలతో పోలీసులు జరిపిన ఆటవిక దాడులను మరియు అణచివేత ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నాం.నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలి. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, నష్టపోయిన విద్యార్థులకు వెంటనే న్యాయం చేయాలి. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ప్రవేశ పరీక్షల్లో అక్రమాలు జరగకుండా కఠినమైన చట్టం తీసుకురావాలి.కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా యర్రగొండపాలెం నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో విద్యాసంస్థల బంద్ మరియు భారీ నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నాం. ఉదయం 9:00 గంటలకు ప్రారంభ స్థలం: అంబేద్కర్ సెంటర్, యర్రగొండపాలెం ఈ నిరసన కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయులు, మేధావులు, యువత మరియు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతున్నాం. ప్రైవేట్ మరియు ప్రభుత్వ విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా సహకరించి స్వచ్ఛందంగా బంద్ పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

## కోట అభివృద్ధికి మరో ముందడుగు.. ఎన్‌సీఆర్ నగర్‌లో కల్వర్టు నిర్మాణం



**నెల్లూరుజిల్లా కోట మండలం కోట జూలై 23 (అఖండ భూమి న్యూస్):** కోట పట్టణంలోని ఎన్.సి.ఆర్ నగర్ మెయిన్ రోడ్డుపై నిర్మిస్తున్న కల్వర్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలుగుదేశం పార్టీ తిరుపతి జల మైనార్టీ సెల్ అధ్యక్షులు అహ్మద్ అహ్మద్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గురువారం ఆయన పనులు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్షాకాలంలో నీటి పారుదల సమస్యలు లేకుండా కల్వర్టును నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రోడ్డు పనులు పూర్తయిన అనంతరం ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని, వర్షపు నీరు సులభంగా వెళ్లేలా కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టామని వివరించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఆయన ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ధి పనుల్లో ప్రజల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సేవే లక్ష్యంగా... సమాజ శ్రేయస్సే ధ్యేయంగా ఎం.వి. రావు ఫౌండేషన్




**నెల్లూరుజిల్లా కోట మండలం విద్యానగర్ జూలై 23 (అఖండ భూమి న్యూస్):** నేటి కాలంలో సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో పనిచేసే స్వచ్ఛంద సంస్థలు చాలా అవసరం. అలాంటి సంస్థల్లో నెల్లూరు జిల్లా కోట మండలం చెందోడుకు చెందిన ఎం.వి. రావు ఫౌండేషన్ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించడం ఫౌండేషన్ సేవల్లో విశేషం. కంటి సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందించేందుకు వైద్య నిపుణులతో కలిసి శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఎంతో ప్రయోజనం పొందుతున్నారు. ఆరోగ్య సేవలతో పాటు ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడం, అవసరమైన చోట సేవా కార్యక్రమాలకు ఆర్థిక, సామాజిక సహకారం అందించడం వంటి కార్యక్రమాల్లో కూడా ఫౌండేషన్ చురుకుగా పాల్గొంటోంది. ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని ప్రజలకు చేరువయ్యే విధంగా కార్యక్రమాలను నిర్వహించడం సంస్థ ప్రత్యేకతగా నిలుస్తోంది. ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం. విజయలక్ష్మి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. ప్రజలకు అవసరమైన చోట సేవ అందించాలనే లక్ష్యంతో ఫౌండేషన్ ముందుకు సాగుతోంది. సేవ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు, సమాజానికి అవసరమైన సమయంలో అండగా నిలవడమే నిజమైన సేవ అని ఎం.వి. రావు ఫౌండేషన్ తన కార్యక్రమాల ద్వారా నిరూపిస్తోంది. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు మరింత మేలు చేకూరాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమాజ శ్రేయస్సే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఎం.వి. రావు ఫౌండేషన్ సేవలు మరెన్నో సంస్థలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి.

## కరోనా,సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి-ఎంపీపీ తోట రవి

కిర్లంపూడిలో హెచ్‌డీఎస్ సమావేశం,ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ ఆసుపత్రి సేవలపై సమీక్ష

వైద్యులకు సూచించిన ఎంపీపీ తోట రవి



**కిర్లంపూడి, జూలై 23 (అఖండ భూమి న్యూస్):** కరోనా,సీజనల్ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ తోట రవి అన్నారు.కాకినాడ జిల్లా కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) సమావేశం ఎంపీపీ,హెచ్‌డీఎస్ చైర్మన్ తోట రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కరోనా వ్యాప్తి నేపథ్యంలో ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించడంతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని వైద్యులను ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు,మౌలిక సదుపాయాలు,రోగులకు అందుతున్న సేవలపై సమావేశంలో చర్చించారు.ఈ సమావేశంలో వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ,హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ గౌతు చినబాబు,నాయకులు తూము కుమార్,ఎంపీడీఓ హరికృష్ణ,తహసీల్దార్ సాయికిరణ్, వైద్యులు రాంబాబు నాయక్,అభిషేక్, స్వాతి,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కప్పట్రాళ్ళ గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ పనుల ప్రారంభం



**దేవనకొండ జూలై 23 (అఖండ భూమి న్యూస్):** దేవనకొండ మండలం, కప్పట్రాళ్ళ గ్రామంలోని చాకలి వీధిలో ఏళ్లుగా వేధిస్తున్న తాగునీటి సమస్య పరిష్కారానికి అడుగు పడింది. రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి కప్పట్రాళ్ళ బొజ్జమ్మ గారి ప్రత్యేక చొరవతో గురువారం కొత్త తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ పనులను దేవనకొండ మాజీ ఎంపీపీ శ్రీ కప్పట్రాళ్ళ రామచంద్ర నాయుడు గారు స్వయంగా పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థులకు త్వరితగతిన స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంతో చాకలి వీధి ప్రజలు తమ నిరంతర నీటి సమస్య తీరబోతుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## చంద్రన్న బీమా ... కార్యకర్తల కుటుంబాలకు గొప్ప ధీమా : ప్రత్తిపాటి

- రమేష్, రామారావు, శ్రీంకాంత్ కుటుంబాలకు

పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది : ప్రత్తిపాటి.

- 15లక్షల రూపాయల విలువైన ప్రమాద బీమా

అందజేసిన ప్రత్తిపాటి.



**చిలకలూరిపేట జూలై 23 (అఖండ భూమి న్యూస్):** తెలుగుదేశం సైనికుల సంక్షేమం..సంతోషానికి టీడీపీ అధినాయకత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని, ప్రమాదవశాత్తూ మరణించిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడం.. కార్యకర్తల పిల్లల యోగక్షేమాలు, చదువుసంధ్యలు చూడటంలో పార్టీ ఎప్పుడూ ముందుంటుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. కార్యకర్తల సంక్షేమం కోసం చంద్రబాబు ప్రవేశపెట్టిన చంద్రన్నబీమా నిజంగా లక్షలాది టీడీపీ కుటుంబాలకు గొప్ప ధీమాగా నిలుస్తోందని ప్రత్తిపాటి తెలిపారు.

**రమేష్, రామారావు, శ్రీంకాంత్ కుటుంబాలకు అండగా ఉంటాం...**

ఇటీవలి కాలంలో మూడు వేర్వేరు దుర్ఘటనల్లో ప్రమాదవశాత్తూ మరణించిన ముగ్గురు టీడీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి స్థానిక క్యాంప్ కార్యాలయంలో ప్రమాద బీమా పరిహార చెక్కులు అందించారు. చిలకలూరిపేట రూరల్ మండలం కోమటినేనివారిపాలెం గ్రామానికి చెందిన వెంపరాల రమేష్, నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం గ్రామ నాయకులు నెల్లూరి రామారావు, జంగాలపల్లి గ్రామానికి చెందిన మద్ది శ్రీకాంత్ ఇటీవల మరణించిన నేపథ్యంలో, ప్రత్తిపాటి గురువారం వారి కుటుంబసభ్యులతో మాట్లాడి, ఒక్కో కుటుంబానికి పార్టీ అందించిన రూ.5లక్షల విలువైన చెక్కులు అందించి, వారి కుటుంబ పరిస్థితులు తెలుసుకున్నారు. పార్టీకి పటిష్టత, గౌరవం కోసం పాటుపడిన రమేష్, రామారావు శ్రీకాంత్ ఆత్మకుశాంతి కలగాలని వారి కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటామని ప్రత్తిపాటి చెప్పారు.

**యువనేత లోకేశ్ సారథ్యంలో పార్టీ మరిన్ని విజయాలు సాధిస్తుంది**

ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ... దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేనంత కార్యకర్తల బలం టీడీపీకి ఉందని, వారే పార్టీ సైన్యమని. ప్రజలకు మంచి చేయడంలో వారు నిస్వార్థంగా తమసేవలు అందిస్తారని తెలిపారు. అటువంటి కార్యకర్తల్ని ఆదుకోవాలన్న ధృఢచిత్తంతో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రమాదబీమా సౌకర్యం కల్పించారన్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా లోకేశ్ బాధ్యతలు చేపట్టాక పార్టీకి యువరక్తం ఎక్కించి నూతనోత్తేజం తీసుకొచ్చారని ప్రత్తిపాటి చెప్పారు. లోకేశ్ సారథ్యంలో పార్టీ ఇటీవలే కోటిసభ్యత్వాలు పూర్తిచేసుకుందని, కోటిమంది సైన్యాన్ని నడిపించడంలో, వారి సాధకబాధకాలు తెలుసుకోవడంలో యువనేత లోకేశ్ చురుగ్గా వ్యవహరిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. సొంత సోదరుడిలా అన్నివేళల కార్యకర్తలకు అండగా నిలుస్తున్న లోకేశ్ నాయకత్వంలో పార్టీ మరిన్ని విజయాలు సాధిస్తుందని ప్రత్తిపాటి ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జార్వర్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, టీడీపీ నాయకులు కోడె హనుమంతరావు, సౌరెడ్డి, మద్దిబోయిన శివ, గంజి శ్రీనివాసరావు, గుర్రం నాగ పూర్ణచంద్రరావు, గ్రామ నాయకులు, వివిధ హోదాలలో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగురాళ్లలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్. ఎస్ఐ శివ నాగరాజు



**మాచవరం జూలై 23 (అఖండ భూమి న్యూస్):** పిడుగురాళ్లలో గుర్తు చప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పిడుగురాళ్ల ఎస్ఐ శివ నాగరాజు గురువారం తెలిపారు. మాదకద్రవ్యాలు నిర్మూలన కార్యక్రమాల్లో భాగంగా పిడుగురాళ్ల పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తుండగా రాబడిన సమాచారం మేరకు పిడుగురాళ్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద మాయాబజార్ కు చెందిన మారు బోయిన అరుణ్ సాయి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా అతని వద్ద 410 గ్రాముల గంజాయి లభ్యమైందన్నారు. ఈ గంజాయిని విచారణలో నిందితుడు వినుకొండకు చెందిన లీల అనే వ్యక్తి నుండి గంజాయి కొనుగోలు చేసినట్లు అంగీకరించారు దీనిపై అరుణ్ సాయి పై కేసు నమోదు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు

## దృశ్య శ్రవణ ప్రదర్శనలతో ప్రయాణికులకు అవగాహన

డ్రగ్స్,హెల్మెట్ భద్రత,ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై పెద్దాపురం పోలీసుల చైతన్యం



**పెద్దాపురం,(అఖండభూమి న్యూస్ ప్రతినిధి లోవరమేష్ జూలై 23 ):** కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పెద్దాపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గురువారం సీఐ వై ఆర్ కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్దాపురం పోలీసులు ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.దృశ్య శ్రవణ విధానం ద్వారా పలు షార్ట్ ఫిలిమ్స్‌ను ప్రదర్శించి ప్రజలకు భద్రతా అంశాలపై అవగాహన కల్పించారు.డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని,యువత మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వివరించారు.మహిళలు,కుటుంబాల భద్రత కోసం అందుబాటులో ఉన్న ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న పీఎం రాహత్ ఉచిత వైద్య సేవలు రూ.1.50 లక్షల వరకు అందుబాటులో ఉన్న విషయాన్ని వివరించారు.అదేవిధంగా బస్సులు,ఆటోలు వంటి ప్రయాణ సాధనాల్లో జరిగే బ్యాగ్ లిఫ్టింగ్,దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రయాణికులకు సూచించారు.

## ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాకు చినశంకర్లపూడి గ్రామస్తుల కృతజ్ఞతలు

--సీసీ రోడ్లు,విద్యుత్ సౌకర్యాల కల్పనపై హర్షం





**ప్రత్తిపాడు,(అఖండభూమి న్యూస్ ప్రతినిధి లోవరమేష్ జూలై 23):** మండలం చినశంకర్లపూడి గ్రామంలో నూతన సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించడంతో పాటు తక్కువ వోల్టేజ్ సమస్య పరిష్కారానికి గ్రామపంచాయతీ ప్రాంతం,కృష్ణాలయం వీధిలో నూతన విద్యుత్ స్తంభాలు,సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసిన ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు.సీసీ రోడ్లు, విద్యుత్ సౌకర్యాల మెరుగుదలతో గ్రామంలో అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మిరియాల శ్రీను,ఏక సత్యనారాయణ, తంగెళ్ల సత్యనారాయణ, మిరియాల వెంకన్న,కాసేపు పెద్దకాపు,రామిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడకు నివాళులర్పించిన మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తోట నగేష్



**కిర్లంపూడి,(అఖండభూమి న్యూస్ ప్రతినిధి లోవరమేష్ జూలై 23):** మాజీ మంత్రి,కాపు ఉద్యమనేత స్వర్గీయ ముద్రగడ పద్మనాభం మృతికి మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, జనసేన నాయకులు తోట నగేష్ నివాళులర్పించారు.కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి చేరుకున్న ఆయన ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ముద్రగడ సేవలను స్మరించుకున్నారు. ముద్రగడ తనయులు బాలు, గిరిబాబులకు సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో కిర్లంపూడి సొసైటీ మాజీ అధ్యక్షులు చదలవాడ బాబి,మాజీ ఉపసర్పంచ్ గౌతు జగన్నాధరావు,దోమాల కృష్ణ జడ్జి తదితరులు పాల్గొన్నారు.

## నేడు మాచవరం మండలంలో మెగా PTM 4.0.ఎంఈఓ శ్రీధర్




**మాచవరం జులై 23. (అఖండ భూమి న్యూస్)** మాచవరం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మెగా టీచర్స్ మరియు పేరెంట్స్ ( మెగాపిటీ 4.0)ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ మరియు గ్రామ ప్రజా ప్రతినిధులు మహిళలు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలన్నారు ఈ కార్యక్రమానికి మాచవరం ఎంపీపీ కొక్కెర అంజమ్మ పిల్లుట్ల కస్తూరిబాయి పాఠశాలకు హాజరవుతారన్నారు

## నాతవరంలో ఘనంగా వీరుడు పడకలు



**నాతవరం జూలై 23 (అఖండ భూమి న్యూస్):** నాతవరం మండల కేంద్రంలో గల వీరుడి మెట్టపై వెలసిన శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి అనే వీరుడు బాబుని పూర్వం నుండి నాతవరం గ్రామ ప్రజలు ఆజ్ఞాపికంగా కొలిచేవారు అందులో భాగంగా ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో వీరుడు పనకాలను సాంప్రదాయబద్ధంగా గ్రామ ప్రజలు జరుపుకోవడం జరుగుతుంది అందులో భాగంగా గురువారం నాతవరం గ్రామ భక్తులు ప్రజలు కలసి స్వామివారికి సంబరంతో స్వామివారి వీరుడుమెట్టకే చేరుకొని అభిషేకంలో పూజలు నిర్వహించి సకాలంలో వర్షాలు పడి రైతులకు పంటలు బాగా పండి సుభిక్షంగా ఉండాలని పూజలు అభిషేకంలో నిర్వహించారు అనంతరం స్వామివారి ప్రసాదం స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందియున్నారు ఈ కార్యక్రమంలో నాతవరం గ్రామ ఎక్స్ ఉప సర్పంచ్ కనక అప్పలరాజు అప్పిరెడ్డి మహేష్ పోలిరెడ్డి రాజు యూత్ సభ్యులు చిటికెల రామకృష్ణ సింగంపల్లి గణేష్ జిల్లా వైఎస్సార్సీపీ నాయకులు కంభే వంశీ తోపాటు గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు

## యనమల రామకృష్ణుడు సోదరుని మృతికి సంతాపం తెలిపిన మాజీ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

తొండంగి మండలం ఏ వి నగరంలో పరామర్శ



**శంఖవరం(,అఖండభూమి న్యూస్ ప్రతినిధి లోవరమేష్ జులై 23):** కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏ వి నగరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు సోదరుడు మృతి చెందగా,గురువారం ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి,ధైర్యంగా ఉండాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

Editor, Printed, Published and Owned by"MASAPOGU ESWARAIAH ,"H.No - 77/1361-E-2-2-E, Faruk Nagar, (Srinivasa Nagar), Aditya Nagar, Kallur Estate, Kallur(M), Kurnool Dist-518003, Andhra Pradesh, R N I , APTEL 2 0 2 2 / 8 4 0 4 2"Printed at SK PUBLICATIONS, S.NO-46-683-A, BUDHAWARA PETA, KURNOOL DIST-518002, AP. E-mail : akhandabhoomitelugudaily@gmail.com, Cell : +91 9440912389, 9490315559